
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States




తిరుమల శ్రీవారిని దర్శించుకుని వేద ఆశీర్వచనాలు పొందిన ఏపి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కావేటి విజయానంద్ -విజయవాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :


సంపుటి : 23 | సంచిక : 310 | ది. 8-2-2025 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# ఏఎన్ఆర్ కు ప్రధాని మోదీ ఘన నివాళి

● యార్లగడ్డ విరచిత "మహాన్ అభినేత అక్కినేని క విరాట్ వ్యక్తిత్వం" పుస్తకాన్ని పీఎంకు బహుకరించిన నాగార్జున



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ప్రముఖ తెలుగు నటుడు, దాత అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) భారతీయ చిత్రసీమకు చేసిన అపారమైన సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా స్మరించుకున్నారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో, ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగార్జున ప్రధాని మోదీకి "మహాన్ అభినేత అక్కినేని క విరాట్ వ్యక్తిత్వం" అనే పుస్తకాన్ని అందజేశారు. ఏఎన్ఆర్ 100వ జయంతిని పురస్కరించుకుని రచించబడిన ఈ పుస్తకాన్ని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, మాజీ ఎంపీ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రచించారు. ఈ పుస్తకం ఏఎన్ఆర్ యొక్క సినీ ప్రస్థానం, సమాజానికి అందించిన సేవలు, మరియు ఆయన ప్రభావాన్ని వివరిస్తుంది. ఏఎన్ఆర్ సినీ రంగంలో ఏడు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్న ప్రధాని మోదీ, తెలుగు చిత్రసీమను తీర్చిదిద్దడంలో ఆయన కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రతిబింబించడంలో ఏఎన్ఆర్ విశేషంగా రాణించారని పేర్కొన్నారు. చెన్నై నుంచి హైదరాబాద్‌కి తెలుగు చిత్రపరిశ్రమను మార్చడంలో ఆయన తీసుకున్న దృఢమైన నిర్ణయం, నేడు హైదరాబాద్‌ను గ్లోబల్ సినిమా హబ్‌గా నిలిపిందని ప్రధానమంత్రి గుర్తు చేశారు. ఏఎన్ఆర్ కేవలం నటుడిగానే కాకుండా, విద్య, సాహిత్యం, ప్రజా సేవలోనూ విశేషమైన కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన స్థాపించిన అన్నపూర్ణ స్టూడియోస్ సినీ నిర్మాణ కేంద్రంగా నిలవడమే కాకుండా, విద్యారంగానికి చేసిన సేవలలో భాగంగా గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వంటి అనేక విద్యా సంస్థలను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ "మనకి బాత్" 117వ ఎపిసోడ్‌లో తపన్ సిన్హా, రాజ్ కపూర్‌లతో పాటు ఏఎన్ఆర్‌కు అర్పించిన నివాళిని మరోసారి గుర్తు చేశారు. భారతీయ సినిమా గొప్పతనాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, ఈ ఏడాది భారత్‌లో వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్‌మెంట్ సమ్మిట్ ను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తన తండ్రి ఏఎన్ఆర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినందుకు హర్షం వ్యక్తం చేసిన నాగార్జున, ఆయన ప్రభావం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మవిభూషణ్ వంటి గౌరవాలు అందుకున్న ఏఎన్ఆర్ భారతీయ సినీ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సమావేశం, భారతీయ చలనచిత్ర చరిత్రలో ఒక మహనీయ నటుడి సేవలను గౌరవించే కీలక ఘట్టంగా నిలిచింది.

# స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికకు చేయూతనివ్వండి

● నూతన సాంకేతికత - ఆవిష్కరణలు అందించండి ● నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీని కోరిన సీఎం చంద్రబాబు ● రాష్ట్రంలో అవకాశాలు - ఆకాంక్షలపై ప్రజంటేషన్



**అమరావతి, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** వన్ ఫ్యామిలీ... వన్ ఏఐ ప్రొఫెషనల్ - వన్ ఎంట్రప్రెన్యూర్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, దీనికి కేంద్ర సాయం అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీతో అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయాలనికి వచ్చిన సుమన్ బేరీకి... ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను, అభివృద్ధి ఆకాంక్షలను ముఖ్యమంత్రి వివరించారు. ఆవిష్కరణలు - సాంకేతికత అందించడం, నూతన విధానాల అమలుకు తోడ్పడటంలో నీతి ఆయోగ్ సహకారాన్ని ఈ సందర్భంగా కోరారు. ఏపీ ప్రతీ ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు, తద్వారా 42 వేల డాలర్ల తలసరి ఆదాయానికి అందరూ చేరుకునేలా ప్రయత్నిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. నీతి ఆయోగ్ మద్దతు ఉంటే రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని... వికసిత్ భారత్ 2047 సాధనలో ఏపీ మోడల్ స్టేట్‌గా ఉంటుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేయగా, కేంద్రానికి - రాష్ట్రానికి ఇది అనుకూల సమయమని, అభివృద్ధికి ఎంతో ఆస్కారముందని... ఇందులో నీతి ఆయోగ్ భాగస్వామ్యం కూడా కచ్చితంగా ఉంటుందని సుమన్ బేరీ అన్నారు.

**'సర్ణాంధ్ర-2047'పైనే ఫోకస్ :** ఆర్థిక వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, సుస్థిరత... ప్రధానాంశాలుగా స్వర్ణాంధ్ర-2047పై ప్రధానంగా దృష్టిపెట్టామని ముఖ్యమంత్రి అన్నారు. మానవాభివృద్ధి-ఉత్తమ పాలన అంశాల్లో గ్లోబల్ లీడర్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. అయితే రాష్ట్రం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోందని... అందులో ముఖ్యంగా రాష్ట్ర విభజన వల్ల రెండు రాష్ట్రాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం, రాష్ట్ర ఆదాయానికి గ్రోత్ ఇంజిన్ వంటి హైదరాబాద్‌ను కోల్పోవడం, ఏపీ పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడం, గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు మూలధన వ్యయంపై నిర్లక్ష్యం చూపడం, మౌలికవసతులను కల్పించకపోవడం... వంటివి ఉన్నాయని చెప్పారు.

**సవాళ్లు ఎదురైనా సాధిస్తాం :** పాలనలో పలు అడ్డంకులు తలెత్తినా రాష్ట్రానికి ఉన్న అనుకూలతలతో అన్ని విధాలా బలోపేతం చేసేందుకు శ్రమిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ దేశంలో 3వ అతిపెద్ద తీర ప్రాంతం కలిగి ఉండటం, పోర్టులు-రైల్వే-హైవేలతో అతిపెద్ద కనెక్టవిటీ, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, తూర్పు-ఆగ్నేయాసియాకు గేట్ వే కావడం, పునరుత్పాదకత విద్యుత్, డేటా టెక్నాలజీలో పెట్టుబడులను ఆకర్షించడం ఏపీకి ప్రధాన సానుకూలాంశాలుగా తెలిపారు.

**రాష్ట్రంలో 3 గ్రోత్ హబ్‌లు :** దేశంలోని 4 గ్రోత్ హబ్‌లో ఒకటిగా ఉన్న విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)తో పాటు తిరుపతి - అమరావతిని రీజినల్ గ్రోత్ హబ్‌లుగా మలిచేందుకు నీతి ఆయోగ్ సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. బ్లూ ఎకానమీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ డెవలప్మెంట్... గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని అన్నారు. డేటా సేకరణ, బెస్ట్ ప్రాక్టీసెస్, స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్, ప్రైవేట్ పెట్టుబడులను ఆకట్టుకోవడం, ఎఫ్‌డీఐ, రిసోర్స్ మొబిలైజేషన్ తదితర విషయాల్లోనూ నీతి ఆయోగ్ కీలకపాత్ర పోషించాలనే ఆకాంక్షను ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలకు సమీక్ష చేయాలన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, స్కిల్లింగ్ హబ్స్, స్మార్ట్ సిటీలు, మౌలిక వసతుల బలోపేతంలో ఏపీ ప్రభుత్వం - నీతి ఆయోగ్ కలిసి పనిచేయాలని ప్రతిపాదించారు. ఏపీ తీసుకున్న కీలక కార్యక్రమాలైన నదుల అనుసంధానం, పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మాలన, 2047 విజన్‌లోని పది ప్రధాన సూత్రాల అమలుకు నీతి ఆయోగ్ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 3 సీ పోర్టులు, 3 ఎయిర్ పోర్టులు ఉన్న తిరుపతి-చెన్నయ్-నెల్లూరును ట్రై సిటీగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతం అభివృద్ధిలో దూసుకువెళ్తుందని అన్నారు.

**కారు దగ్గరకు వెళ్లి మరీ వీడ్కోలు :** హైదరాబాద్‌లో తాను అభివృద్ధి చేసిన జీనోమ్ వ్యాలీలో ఇప్పుడు 700 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో అత్యుత్తమ పాలసీలను ఏపీలో అమలు చేయాలనేది తమ విధానమని ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 11 వేలకు పైగా ఈవీ బస్సులను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్టు, అలాగే రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లపైనా రూఫ్ టాప్ సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. సచివాలయానికి తొలిసారి వచ్చిన సుమన్ బేరీకి ఘనంగా స్వాగతం పలకడమే కాకుండా... సమావేశం అనంతరం ఆయన తిరిగి వెళ్లేటప్పుడు కారు దగ్గరకు వెళ్లి మరీ ముఖ్యమంత్రి వీడ్కోలు పలికారు.

# మంత్రివర్గంలోకి రాబోయే 'ఆ నలుగురు' ఎవరో..?

● మంత్రివర్గంలో కొత్తగా నలుగురుకి ఛాన్సు దక్కచ్చని పార్టీవర్గాల సమాచారం



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీకి చేరుకోగానే ఒక్కసారిగా ఊహాగానాలు పెరిగిపోతున్నాయి. తొందరలో మంత్రివర్గ విస్తరణ ఖాయమనే ప్రచారం ఒకవైపు, మంత్రివర్గంలో చోటు దక్కించుకోబోయే అదృష్టవంతులు ఎవరనే విషయంలో ఊహాగానాలు మరోవైపు పెరిగిపోతున్నాయి. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో కొత్తగా నలుగురుకి ఛాన్సు దక్కచ్చని పార్టీవర్గాల సమాచారం. అందుకనే ఆ నలుగురు ఎవరనే విషయంలో పార్టీలో విస్తృతమైన చర్చలు పెరిగిపోతున్నాయి. మంత్రి వర్గ విస్తరణ అంశం చాలాకాలంగా పెండింగులో ఉంది. లోక్ సభ ఎన్నికలు అయిన దగ్గర నుండి అదిగో మంత్రివర్గ విస్తరణ..ఇదిగో మంత్రివర్గ విస్తరణ అంటూ ఊహాగానాలు వినబడుతునే ఉన్నాయి. ఇందులో భాగంగానే రేవంత్ ఢిల్లీ పర్యటన సందర్భంగా క్యాబినెట్ లో చోటుదక్కించుకోబోయే అదృష్ట వంతులు ఎవరో ? అనే విషయంలో కొందరిపేర్లు వినబడుతున్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుండి ఇపుడు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. పార్టీవర్గాల సమాచారం ప్రకారం మంత్రివర్గ విస్తరణకు మాత్రమే రేవంత్ పరిమితం అవుతారా ? లేకపోతే ప్రక్షాళన కూడా చేస్తారా అన్నది అనుమానంగా మారింది. విస్తరణ మాత్రమే ఉంటుందంటే కొత్తగా కొంతమందిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే క్లారిటి వచ్చేస్తుంది. అలాకాకుండా ప్రక్షాళన తప్పదని అంటే కొత్తవారిని తీసుకోవటంతో పాటు ఇపుడున్న మంత్రుల్లో కొందరికి ఉధ్వాసన తప్పదు. ప్రక్షాళన అంటే అది వేరే సమస్యకు దారి తీసినా ఆశ్చర్యపోవక్కర్లేదు. ఎందుకంటే, మంత్రివర్గంలో నుండి బయటకు వెళ్ళిన వాళ్ళు ఊరికే కూర్చోరు కదా ? రేవంత్ కు వ్యతిరేకంగా తయారవుతారు. తమ నియోజకవర్గాల్లో అవకాశముంటే జిల్లాల్లో వ్యతిరేకవర్గాన్ని కూడగట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెడతారనటంలో సందేహంలేదు. ఇపుడు విషయం ఏమిటంటే మంత్రివర్గం లో చోటుకోసం చాలామంది ప్రయత్నిస్తున్నారు. దానం నాగేందర్, సుదర్శన్ రెడ్డి, మాణిక్ రావు, ప్రేమ సాగర్ రావు, ఆది శ్రీనివాసరావు, అజరుద్దీన్, షబ్బీర్ ఆలీ పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. ప్రస్తుత మంత్రివర్గంలో మైనారిటీలు ఎవరూ లేరు. రేవంత్ ప్రమాణస్వీకారం చేసేటపుడే షబ్బీర్ లేదా అజరుద్దీన్ ను తీసుకోవాలని ప్రయత్నంచేశాడు. అయితే అందుకు అధిష్టానం అంగీకరించకపోవటంతో సాధ్యంకాలేదు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని మంత్రివర్గంలోకి తీసుకోవటానికి అధిష్టానం అంగీకరించలేదు. షబ్బీర్, అజారుద్దీన్ ఇద్దరు నిజామాబాద్ రూరల్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో పోటీచేసి ఓడిపోయారు. సరే, అప్పట్లో అంటే అధిష్టానం ఒప్పుకోలేదు కాబట్టి పై ఇద్దరిలో ఎవరినీ తీసుకోలేదు. కాని పార్టీ మొత్తం మీద గెలిచిన ముస్లిం మైనారిటీలే ఎవరూ లేరు. కాబట్టి ఐదేళ్ళ మంత్రివర్గం నుండి ముస్లిం మైనారిటీలను దూరంగా ఉంచటం సాధ్యంకాదు. అందుకనే పై ఇద్దరిలో ఎవరో ఒకళ్ళని మంత్రివర్గంలోకి తీసుకునేట్లుగా అధిష్టానాన్ని ఒప్పించేందుకు రేవంత్ గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మొత్తం మీద ఈనెల 27వ తేదీన మూడు ఎంఎల్సీ సీట్లకు ఎన్నికలు అయిపోగానే మంత్రివర్గంపై అధిష్టానం ఏదో ఒక నిర్ణయం చెబుతుందనే ప్రచారమైతే పెరిగిపోతోంది. ఎంఎల్సీ ఎన్నికల పోలింగ్ అయిపోగానే, స్థానిక సంస్థల ఎన్నికల్లోగా మంత్రివర్గంపై నిర్ణయం ఉంటుందని అంటున్నారు. మరి అధిష్టానం ఆ ముచ్చట ఎప్పుడు చెబుతుందో చూడాలి.

# ముప్పు కూటమి నుంచి కాదు...అందుకే జగన్ కి ధైర్యం!




పార్టీ నుంచి ఎంతమంది వెళ్ళిపోయినా వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా ధైర్యంగా ఉన్నారు. అది చాలా మందికి అతి విశ్వాసంగా కనిపిస్తోంది. కానీ లోతుగా ఆలోచిస్తే జగన్ ధీమా వెనక బలమైన కారణాలు ఉన్నాయి. అంతే కాదు సరైన రీజనింగ్ కూడా ఉంది. అందుకే జగన్ కూటమి నుంచి ఎంతగా సవాళ్ళు వస్తున్నా లైట్ తీసుకుంటున్నారు. మళ్ళీ మేమే అధికారంలోకి వస్తామని చెప్పగలుగుతున్నారు. పార్టీ నుంచి గడచిన ఎనిమిది నెలలుగా ఎంతో మంది వెళ్ళిపోయారు. అందులో బిగ్ షాట్స్ చాలా మంది ఉన్నారు. ఆఖరుకు విజయసాయిరెడ్డి వెళ్ళిపోవడమే బిగ్ ట్విస్ట్ అని అంటున్నారు. అయినా జగన్ పెద్దగా పట్టించుకోవడం లేదు అంటే ఆయన ఆలోచనలే వేరు అని అంటున్నారు. అవి ధీమాతో కూడినవి అని కూడా అంటున్నారు.

**విజయవాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఏపీలో రెండు పార్టీల వ్యవస్థ ఎలా ఉందో.. రెండు రాజకీయ సిద్ధాంతాలు వ్యవస్థ కూడా అలాగే ఉంది. ఒకటి మధ్యేవాద రాజకీయ సిద్ధాంతం. అది బీజేపీ తెలుగుదేశం జనసేన వంటి పార్టీలను ఆకట్టుకుంటుంది. ఉన్నత స్థాయి వర్గాలు, మధ్యతరగతి, పై మధ్య తరగతి వంటివి ఈ రాజకీయ ఫిలాసఫీకి కట్టుబడి ఉంటాయి. దాంతో ఈ వర్గాలు ఎపుడూ ఈ పార్టీల వైపు మొగ్గు చూపిస్తారు. ఇక అట్టడుగు వర్గాలు ఉన్నాయి. అలాగే మైనారిటీ వర్గాలు కూడా ఉన్నాయి. ఈ వర్గాల రాజకీయ ఫిలాసఫీ వేరు. వీరంతా బీజేపీ సెంట్రిక్ పాలిటిక్స్ కి దూరం పాటిస్తారు. అంతే కాదు మధ్యేవాద రాజకీయ సిద్ధాంతానికి వీరు యాంటీగా తమదైన రాజకీయ ఫిలాసఫీని ఇష్టపడతారు. ఈ వర్గాలు మొదట కాంగ్రెస్ ఆ తరువాత వైసీపీకి అండగా ఉన్నాయి. ఆ విధంగా చూస్తే రెండు పార్టీల వ్యవస్థ గా పైకి ఏపీలో కనిపించినా రెండు బలమైన సిద్ధాంతాల మధ్య పోరాటంగా లోతుగా చూస్తే అర్థం అవుతుంది. అలా చూసినపుడు కూటమికి మద్దతుగా ఉన్న ఫిలాసఫీ కానీ వర్గాలు కానీ వైసీపీకి అండగా ఉన్న వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేసినా అవి ఫలించే అవకాశాలు అంతగా ఉండవు. అందుకే వైసీపీకి 40 శాతం ఓటు బ్యాంక్ 2024 ఎన్నికల్లోనూ దక్కింది. అన్ని పార్టీలు కలసి వచ్చినా వైసీపీ బలంగా ఉంది అంటే ఈ సైద్ధాంతిక భూమిక ఆ పార్టీని కాపాడుతోంది అన్న మాట. మరో వైపు చూస్తే కనుక ఈ వర్గాలు కాంగ్రెస్ కనుక ఏపీలో బలపడితే మళ్ళీ అటు వైపు మొగ్గు చూపడం ఖాయం. కానీ ఇపుడున్న పరిస్థితుల్లో ఏపీలో కాంగ్రెస్ బలపడేందుకు ఆస్కారం తక్కువ. దాంతోనే వైసీపీకి ఈ ధీమా వచ్చింది అని అంటున్నారు. సిద్ధాంత పునాది ఉన్న పార్టీలకు ఓటములు పలకరించినా తిరిగి లేచేందుకు ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు టీడీపీ. ఆ పార్టీని అల్లుకుని ఉన్న వారంతా తిరిగి గెలిపించుకుంటారు. వైసీపీకి అదే రకమైన పొలిటికల్ ఫిలాసఫీ ఉంది. దాంతోనే వైసీపీ మళ్ళీ గెలుస్తామని అంటోంది. రాజకీయ పార్టీలతో పాటు ఈ సిద్ధాంతాల మధ్య జరిగే పోరాటంలో ఒకసారి ఒక పార్టీ గెలిస్తే మరోసారి ఇంకో పార్టీ గెలుస్తుంది. ఇది అనవాయితీగా ఉంటోంది. ఇక చూస్తే కూటమి వదిలేసిన అలాగే కూటమికి అట్రాక్ట్ కానీ వర్గాలే వైసీపీ బలాలు. అలా ఆలోచిస్తే వైసీపీకి కావాల్సినంతగా పొలిటికల్ స్పేస్ ఏపీలో ఉంది. ఏపీలో ఎన్డీయేతర వర్గాలు అన్నీ కచ్చితంగా జగన్ వెంట ఉంటాయని రాజకీయ విశ్లేషకులూ చెబుతారు. ఎన్డీయేలో ఉన్న పార్టీల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం జగన్ కి ఎపుడూ కలసి వస్తూనే ఉంటుంది. జగన్ తాను నాయకత్వం వహించి పార్టీని దూకుడుగా ముందుకు తీసుకుని పోతే చాలు. ఇక నాయకులు అన్న వారు గాలి మారితే అటు నుంచి ఇటూ వస్తారు. అలాగే కొత్త నీరూ వస్తుంది. అందుకే జగన్ ధీమాగా మేమే గెలుస్తామని అంటున్నారు. కూటమి పార్టీలు వైసీపీ లీడర్స్ ని తీసుకోగలవు కానీ వైసీపీని మోస్తున్న పొలిటికల్ ఫిలాసఫీని ఏమీ చేయలేవని అంటున్నారు. ఏపీ మీద ఎంతో కొంత ద్రవిడ వాద ప్రభావం ఉంది. ఆ ప్రభావంతో ఉన్న వర్గాలే వైసీపీకి ఇపుడు కొండంత అండ. అదే శ్రీరామ రక్ష కూడా అన్నది సిసలైన విశ్లేషణ..

# పోటీ కోసమే ర్యాంకులు ఎవరినీ తక్కువ చేయడానికి కాదు: సీఎం చంద్రబాబు

● ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల ర్యాంకులపై ఎక్స్ వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు ● టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని వెల్లడి



**వెలగపూడి,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని తాను విశ్వసిస్తానని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్?తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే తమ ఆలోచనగా పేర్కొన్నారు. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్?లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చామని తెలిపారు. దస్త్రాల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు, అలాగే ఎవరినీ తక్కువ చేయడానికి కాదని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పని చేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇదని తెలిపారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో తాను కూడా తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని అన్నారు. ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్?తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారని వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.


# ఫిబ్రవరి 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 28న బడ్జెట్!




**అమరావతి,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24 నుంచి జరగనున్నాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు తెరలేవనుంది. ఈ నెల 27న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ చేపట్టనున్నారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలను మొత్తం 15 పని దినాల పాటు నిర్వహించాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. మొదటి రోజు బీఏసీ సమావేశం తర్వాత సభ జరిగే రోజుల సంఖ్యపై స్పష్టత రానుంది. ఇక, ఫిబ్రవరి 28న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో, సభకు పూర్తి స్థాయి సబ్జెక్టుతో సిద్ధమై రావాలని సీఎం చంద్రబాబు మంత్రులకు స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఆర్టీసీ కార్మికులను చర్చలకు ఆహ్వానించిన ప్రభుత్వం

**ఆర్టీసీ ఆపరేషన్స్ ఈడీ మునిశేఖర్‌కు నోటీసు ఇచ్చిన జేఏసీ నేతలు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ)** ఫిబ్రవరి 9లేదా ఆ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగడానికి టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆపరేషన్స్ ఈడీ మునిశేఖర్‌కు జనవరి 27న సమ్మె నోటీసుతోపాటు 21 డిమాండ్ల పత్రాన్ని కార్మిక సంఘాల నేతలు అందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించింది. ఈనెల 10న సాయంత్రం 4గంటలకు చర్చలకు రావాలని ఆర్టీసీ యాజమాన్యం, ఆర్టీసీ జేఏసీకి కార్మికశాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించినట్టు కార్మికశాఖ పేర్కొంది.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవీ..** ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం. రెండు పీఆర్సీల అమలు. 2021 వేతన సవరణ అమలుచేస్తూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు. కండక్టర్లు, డ్రైవర్ల ఉద్యోగ భద్రతపై మార్గదర్శకత్వం. పీఎఫ్, సీసీఎస్ బకాయిల చెల్లింపు. ఆర్టీసీ ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే ఆర్టీసీకి కొనుగోలు చేసి ఇవ్వాలి. ఈ-బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారు. వీటిపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే చెందుతుంది. వీటిని ఆర్టీసీయే తీసుకుని నడపడం వల్ల సబ్సిడీ కూడా ఆర్టీసీకి వస్తుంది. ఆర్టీసీ అభివృద్ధికి బడ్జెట్‌లో 3% నిధుల కేటాయించాలి. సంస్థ అప్పులను టేకోవర్ చేయాలి. మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్‌కు బదులు మహిళలకు స్మార్ట్ కార్డుల పంపిణీ. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి. ఆర్టీసీలో ఖాళీలను భర్తీచేయాలి. పదేళ్లుగా ఆర్టీసీలో నియామకాలు లేకపోవడంతో ఉద్యోగులపై పనిభారం పెరిగింది. సుమారు 16వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయగా.. వారి పనిని సర్వీసులో ఉన్న ఉద్యోగులే చేయాల్సి వస్తోంది. పొరుగుసేవల కింద పనిచేస్తున్న విశ్రాంత అధికారులు, సూపర్‌వైజర్లను తొలగించి పదోన్నతుల ద్వారా ఆయా పోస్టులు భర్తీ చేయాలి. కార్మికులకు 8 గంటల పనిదినాల అమలు, మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల్లోపు విధులు ముగిసేలా చూడాలి. పీఎఫ్‌కు సంబంధించి ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన సుమారు రూ.12 వేల కోట్లను యాజమాన్యం ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపించలేదు. వెంటనే ఈ అంశాన్ని పరిష్కరించాలి.

## సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



**నిజాంపేట్ ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాచుపల్లి వాసులు కేసి రెడ్డి బల్ రెడ్డి, గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేక పోవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసి విన్నవించారు వెంటనే ఆయన స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 2,50,000/- (రెండు లక్షల యాభై వేల రూపాయలు ) సీఎంఆర్ - ఎల్ ఓ సి మంజూరి పత్రాలను కేసి రెడ్డి, రామ్ గోపాల్ రెడ్డి లకు కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, అంజాద్, పద్మ రావు, మోహన్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు గొంగుల నవీన్ పాల్గొన్నారు.

## కొంపల్లి దుర్గమ్మ మహంకాళి కళ్యాణోత్సవం



**పేట్ బషీరాబాద్ ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులోని దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన దుర్గమ్మ మహాకాళి కళ్యాణోత్సవం వేడుకలలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొంపల్లి ప్రజల శాంతి, సమృద్ధి, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం భక్తులతో మాట్లాడిన ఆయన, "ఇటువంటి భక్తి కార్యక్రమాలు ప్రజల మనోభావాలకు శక్తినిచ్చేలా, సమాజంలో సానుకూల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ఉంటాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, మాజి కౌన్సిలర్ జంధా మంజుల కుమార్ గౌడ్, కృష్ణా గౌడ్, లక్ష్మణ్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**కూకట్ పల్లి,ఫిబ్రవరి7(వార్తప్రభ):** తెలంగాణ రాష్ట్రంలోని ఆడపడుచులకు తప్పుడు వాగ్దానాలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పెళ్లి చేసుకున్న వారికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి తులం బంగారం ఎక్కడ పోయిందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. శుక్రవారం కూకట్పల్లి నియోజ కవర్గం లోని కూకట్ పల్లి,బాలనగర్ మండలాల్లో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్లు కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు ,సబిహ గౌసుద్దీన్, జూపల్లి సత్యనారాయణ,ఆవుల రవీందర్ రెడ్డి,పండల సతీష్ గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్ ,మహేశ్వరి శ్రీహరి, ఎమ్మార్వో తో కలిసి 290 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చి పేదింటి కుటుంబాలకు అండగా నిలిచిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఎన్నికల్లో గెలవడం కోసం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారాలు చేశాడు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమి నెరవేర్చలేదని ఎమ్మెల్యే అన్నారు. కళ్యాణ లక్ష్మితో పాటుగా తులం బంగారం ఇస్తారనే ఆశతోనే ఆడపడుచులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే వారికి మొండి చేయి చూసిన కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటుగా తులం బంగారం ఆడపడుచులకు ఇవ్వకపోతే ఊరుకోమని హెచ్చరించారు.

## మాల మహానాడు ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ జన్మదిన వేడుకలు

**బెల్లంపల్లి ఫిబ్రవరి 07 (వార్తప్రభ)** రమాబాయ్ అంబెడ్కర్ జన్మదినం పురస్కరించుకొనిశుక్రవారంబెల్లంపల్లి పట్టణ మాలమహానాడు ఆధ్వర్యంలో స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి గర్భిణీ స్త్రీలకు రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దళితరత్న కుంభాల రాజేష్, గౌరవ అధ్యక్షులుపొట్ట శేఖర్, మాజీ రాష్ట్ర యువజన అధ్యక్షులు ఆసాది మధు, మంచిర్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్మద్దెల గోపి, పట్టణ యూత్ అధ్యక్షులు కట్ట కుమార్,సీనియర్ నాయకులు అంగూరి సుభాష్, సబ్బని అరుణ్ కుమార్, సంభోది సురేష్, బన్న మల్లేష్,తదితరులు పాల్గొన్నారు

# ప్రతిభకు ప్రాక్టీస్ ప్రధానం!!

● ప్రతి పోలీసుకు ఫిజికల్ ఫిట్నెస్ కీలకం ● ఉద్యోగ సమయంలో మానసికంగా దృఢంగా ఉండాలి ● పని ఒత్తిడిలో శిక్షణ కార్యక్రమాలతో ఉపశమనం ● రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్







**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రతిభకు ప్రాక్టీస్ ప్రధానం అని తెలిపారు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్. ఈ మేరకు శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో మొబిలైజేషన్ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు ప్లాటూన్‌లతో కూడిన పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజర్వ్ ఇన్స్పెక్టర్(ఆర్.ఐ.) సంపత్ ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించి అద్భుతంగా పరేడ్ ప్రదర్శించారని సీపీ ప్రశంసించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ....పోలీసు ఉద్యోగంలో రాణించాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్‌తోపాటు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే సిబ్బందికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిక్షణలో ప్రతిభకనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి సీపీ ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం పోలీసు భద్రత బలగాలు మావోయిస్టులతో ఎన్ కౌంటర్ సందర్భాన్ని, విద్యార్థులపై లాఠీ చార్జ్, బాంబు స్క్వాడ్ తనిఖీలు, బాంబ్ డిస్పోజల్స్ , హత్య చేసిన నిందితుడిని డాగ్ స్క్వాడ్ తనిఖీతో పట్టివేత తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి చూపించారు. అలాగే పోలీస్ కమిషనరేట్ పరిధిలో మెన్, వుమెన్ సిబ్బందికి వాష్ రూమ్స్, రెస్ట్ రూమ్స్, ఇతర ఆఫీసులను సీపీ ప్రారంభించారు. ఉన్న వాటిని వినియోగించుకొని వసతులను ఏర్పరచుకునే విధంగా కృషిచేసిన డిసిపి అడ్మిన్ రాజును ప్రత్యేకంగా అభినందించారు. ఈ ముగింపు వేడుకలలో పెద్దపల్లి డిసిపి చేతన, పలువురు ఏసీపీలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు

● అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా సహించేది లేదు ● కాప్రా తహసిల్దార్ సుచరిత

**జవహర్ నగర్, ఫిబ్రవరి,07:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. కాప్రా తహసిల్దార్ సుచరిత ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ సిబ్బంది జెసిబి సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించడం జరిగింది. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితె ఎంతటి వారినైనా సహించేది లేదని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా ఎమ్మార్వో సుచరిత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు



# అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించండి.

**- జిహెచ్ఎంసి అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గాంధి ఆదేశం**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ లో నెలకొన్న పలు సమస్యలు,పెండింగ్ పనులు,చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల లలో నెలకొన్న పలు సమస్యలకు పరిష్కారాలు మరియు చేపట్టే పలు అభివృద్ధి పనుల తో,ప్రజల ఇబ్బందులను తీర్చే విదంగా చర్యలు చేపట్టే విధంగా పలు సూచనలు ఇచ్చారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ, అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్షా నిర్వహించి చేపట్టవలసిన పనులలో జాప్యం నివారణకు చర్యలు చర్చించనైనది మరియు చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు మరియు అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ,అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం ప్రథమ ప్రాధాన్యతగా పనులు చేపట్టాలని, కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని,శంకుస్థాపన చేసిన పనులలో జాప్యం నివారణకు చర్యల పై సమీక్షా సమావేశం జరపడం జరిగినది. రోడ్లు,నాలా నిర్మాణ పనులు,పార్క్ లు ఏవైతే పెండింగ్ లో ఉన్నవో వాటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అదేవిధంగా టెండర్లు పూర్తయిన పనులను వెంటనే పనులు చెప్పట్టాలని పీఏసి చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను పీఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ అదేశించడం జరిగినది. పనులలో జాప్యాన్ని సహించే ప్రసక్తే లేదని, పనులు తీసుకొని జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని,మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలని,శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలని పీఏసి చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది. ఈ సమీక్షా సమావేశం లో జిహెచ్ఎంసి అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్,ఈఈ దుర్గాప్రసాద్ డిఈ ఆనంద్,డిఈ విశాలాక్షి,ఏఈ జగదీష్,ఏఈ రషీద్,ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అధికారులతో కలిసి డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలలో పర్యటించిన

## జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



**జవహర్ నగర్, ఫిబ్రవరి,07:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్మికనగర్ ప్రజలు డంపింగ్ యార్డు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ అధికారులు, కాలని వాసులతో కలిసి డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలలో పర్యటించిన జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రీకాంత్ యాదవ్ దృష్టికి తీసుకురావడంతో అక్కడికక్కడే రాంకీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించడంతో సానుకూలంగా స్పందించిన అధికారులు వెంటనే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, నాయకులు భాస్కర్,సాయికృష్ణ, కాలనీ వ్యవస్థాపకులు కన్నయ్య రాజు, కాలనీవాసులు గడ్డం శ్రీను, అంగడి బాలరాజుతో మహిళలు యువకులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

## కుత్బుల్లాపూర్ గ్రామంలో పర్యటించిన చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామం లో కుత్బుల్లాపూర్ గ్రామస్థులు ట్రాఫిక్ సమస్య వల్ల అలాగే ట్రాఫిక్ సమస్యతో ఆర్టీసీబస్సు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి కి సీనియర్ సిటిజన్స్ తెలియజేయడంతో కుత్బుల్లాపూర్ డీసీ నర్సింలు, జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తో కలిసి శుక్రవారం కుత్బుల్లాపూర్ గ్రామం లో పర్యటించారు. ఈ కార్యక్రమం లో వీరా రెడ్డి,పెద్ది మల్లేష్,గోపాల కృష్ణ,మురళి ,శ్రీరాములు,నర్సింలు,ఉలిపి సత్తయ్య,నార్లకంటి నాగేష్, బండి బిక్షపతి, రాంరెడ్డి, నరహరి ,బుచ్చి రెడ్డి, రఘుపతి రెడ్డి,నార్లకంటి దుర్గయ్య,నార్లకంటి ప్రతాప్,పెద్దింటి సాయిలు,సందీప్ గౌడ్, ప్రవీణ్, శ్రవణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పెద్దమ్మ పోచమ్మ తల్లి ఆలయ 20 వ వార్షిక మహోత్సవం



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ నాయక్ నగర్ లో గల శ్రీ పెద్దమ్మ పోచమ్మ తల్లి ఆలయ 20వ వార్షిక మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఏర్పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.పి. వివేకానంద్ మాట్లాడుతూ అమ్మవారి కృపతో ఎస్.ఆర్.నాయక్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతిసమృద్ధిగా జీవించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని ప్రార్థించానని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కొంపల్లి మాజీ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్,కొంపల్లి మున్సిపల్ బి.ఆర్.ఎస్.పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్,నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ,పీ.వి. భాస్కర్ రెడ్డి,హరిబాబు యాదవ్,పూర్ణ చందర్ గుప్త , జగతయ్య, అనిల్, రామకృష్ణ, దుర్గారావు, మహేందర్ రెడ్డి, వల్లూరి ప్రసాద్, రాజేష్, ఆలయ కమిటి సభ్యులు. బొబ్బా రంగారావు, బొబ్బ ప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, ఆలూరి వెంకట శేషయ్య, భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

## కేటీఆర్ ని కలిసిన అసెంబ్లీ విప్ కె.పి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 7(వార్తాప్రభ) :** బీఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్‌గా నియమితులైన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్, శుక్రవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు ని నర్సింగి జయభేరి టెంపుల్ ట్రీ కాలనీలోని తన నివాసంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు కు ధన్యవాదాలు తెలిపారు. తన నియామకాన్ని పార్టీపై ఉన్న విశ్వాసానికి, ప్రజల సేవకు అంకితం చేస్తానని, తన కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ నాయకత్వం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన తెలిపారు.

## శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం...



**జవహర్ నగర్, ఫిబ్రవరి,07: (వార్తా ప్రభ)** బాలాజీ నగర్ లోని శ్రీశ్రీశ్రీ గంగమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లా వినయ్ కుమార్, నాయకులు భాస్కర్, యాదగిరి యాదవ్, సాయికృష్ణ, మరియు గంగపుత్ర కుల సంఘం సభ్యులు, తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఎడిటోరియల్

## వైసీపీకి కలసిరాని నానీలు !

వైసీపీలో ఒకనాడు అంతా నానీల మయం. ఎటు చూసినా నానీలే. ఏకంగా ముగ్గురు నానీలను తీసుకుని వచ్చి మంత్రులుగా చేశారు వైఎస్ జగన్. అది కూడా తొలి విడతలోనే వారికి చాన్స్ దక్కింది. దాదాపుగా మూడేళ్ళ పాటు వారు అధికారంలో కొనసాగారు. ఇందులో ఇద్దరు నానీలు అయితే ఫైర్ బ్రాండ్స్ గా ముద్ర పడ్డారు. ఈ నానీల త్రయం వైసీపీకి ఒకనాడు ప్లస్ పాయింట్ గా ఉండేది. ఉమ్మడి క్రిష్ణా జిల్లాలో కొడాలి నాని బిగ్ వాయిస్ గా వైసీపీకి నిలిచారు. ఆయన మీడియా ముందుకు వచ్చారు అంటే విపక్షాన్ని తనదైన మాటలతో చీల్చి చెండాడేవారు. ఆయన నోటి దూకుడు విమర్శలకు తావు ఇచ్చినా ఆయన మాత్రం ఎక్కడా తగ్గేవారు కాదు, జగన్ మీద ఈగ వాలనీయకుండా చూసుకునేవారు. ఎంతటి వారు అవతల ఉన్నా ఈజీగా కామెంట్స్ చేసేవారు. అలా వైసీపీ క్యాడర్ కి ఆయన పవర్ లో ఉన్నపుడు ఎంతో పవర్ ఫుల్ గా ఒక పెద్ద పొలిటికల్ ఎసెట్ గా నిలిచేవారు. ఇక అదే జిల్లాకు చెందిన పేర్ని నాని వెటకారం తో విపక్షాల మీద విరుచుకుని పడే తీరు వేరే లెవెల్ అన్నట్లుగా ఉండేది. ఆయన చంద్రబాబు పవన్ ల మీద చేసే సెటైరికల్ కామెంట్స్ అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. డైలాగ్ వార్ అంటే పేర్ని నానే వైసీపీ నుంచి మొదట కనిపించేవారు. ఇక గోదావరి జిల్లాలకు చెందిన ఆళ్ళ నాని ఉప ముఖ్యమంత్రిగా చేశారు. ఆయన వైఎస్సార్ కుటుంబానికి వైసీపీకి వీర విధేయుడిగా ఉండేవారు. ఆయన కూడా పార్టీకి ఆ ప్రాంతంలో బలంగా ఉంటూ వచ్చారు. ఈ ముగ్గురూ నానీలు చాలదన్నట్లుగా 2024 ఎన్నికల ముందు విజయవాడ ఎంపీ కేశినేని నాని కూడా వైసీపీలో చేరిపోయారు. దాంతో నానీలు అంతా ఒక్క చోటనే చేరారు అన్న కామెంట్స్ సరదాగా వినిపించాయి.వీరిలో పేర్ని నాని తప్ప అంతా 2024 ఎన్నికల్లో పోటీ చేశారు ఓడారు, పేర్ని నాని తనయుడు పోటీకి దిగి ఓటమి పాలు అయ్యారు. ఈ నేపథ్యంలో వైసీపీ ఓడిన వెంటనే నాకొద్దీ రాజకీయాలు అని కేశినేని నాని స్వస్తి పలికేసారు. ఇక ఆయన తరువాత ఆళ్ళ నాని అదే బాటలో నడిచారు వైసీపీకి దూరంగా ఉంటానని షాక్ ఇచ్చారు. ఫైర్ బ్రాండ్ గా పేరు పడిన కొడాలి నాని అయితే అయిపూజా లేకుండా పోయారు. ఏపీలో వైసీపీ ఓడి ఎనిమిది నెలలు గడిచాయి కొడాలి నాని ఎక్కడ ఉన్నారో కూడా ఎవరికీ తెలియడం లేదు. పేర్ని నాని మాత్రం ఇటీవల కాలం వరకూ మీడియా ముందుకు వచ్చి వైసీపీని కాసుకునేవారు అయితే ఆయన కుటుంబం మీద కేసులు పడడంతో ఆయన కూడా ఫుల్ సైలెంట్ అయ్యారు ఈ మొత్తం పరిణామాలను చూస్తే కనుక వైసీపీ విపక్షంలో ఉన్న వేళ నానీలు మొత్తం కలసి రాకుండా పోయారు అన్న చర్చ సాగుతోంది. వీరంతా జగన్ కి అత్యంత సన్నిహితులుగా మెలిగేవారు. మీడియా ముందుకు వచ్చి జగన్ మీద విమర్శలు చేసే ప్రత్యర్థులను గట్టిగా ఎదుర్కొనేవారు. ఇపుడు చూస్తే జగన్ లండన్ లో ఉంటే వైసీపీ నుంచి మాట్లాడేందుకు పెద్దగా వాయిస్ ఏదీ లేకుండా పోయింది. మళ్ళీ జగనే మీడియా ముందుకు వచ్చి మాట్లాడేంతవరకూ వైసీపీ గురించి వినే చాన్స్ కూడా క్యాడర్ కి లేకుండా పోయిదంటే నానీలూ ఎక్కడున్నారయ్యా అని అంతా అనుకునే పరిస్థితి అంటున్నారు. చూడాలి మరి ఫ్యూచర్ లో అయినా వీరిలో ఎవరైనా తిరిగి వైసీపీ తరఫున పెద్ద గొంతు చేస్తారేమో.

## గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమం.

### అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రజల సహకారం అవసరం,కైకలూరు టౌన్ సిఐ కృష్ణ.

**కైకలూరు జనవరి 7 (వార్తా ప్రభ)** కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ యొక్క ఆధ్వర్యంలో టౌన్ ఎస్.ఐ లు ఆర్.శ్రీనివాస్,వెంకట కుమార్ లు మరియు వారి సిబ్బందితో కలిసి ఆటపాక గవర్నమెంట్ హైస్కూల్ నందు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఆటపాక గ్రామంలో గవర్నమెంట్ హైస్కూల్ ను సందర్శించి,విద్యార్థినులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించి మహిళా చట్టాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు.



**ఆకతాయి వేధింపుల నివారణ** తక్షణ సహాయం కోసం డయల్ 112 ఉపయోగించవచ్చని వివరించారు.సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.సెంట్రల్ సైబర్ సెల్ ద్వారా సమస్య పరిష్కారం పొందవచ్చని తెలిపారు.చుట్టుపక్కల అసాంఘిక కార్యకలాపాల సమాచారం 95550351100 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.సమాచారదారుల గోప్యతను కాపాడతామని హామీ ఇచ్చారు.చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రజల సహకారం కీలకమని తెలిపారు.సమాజ శ్రేయస్సుకు అందరూ బాధ్యతతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలలో నమ్మకం పెంచి, సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీస్ వారి యొక్క బాధ్యతను అని కైకలూరు టౌన్ ఎస్ఐలు విద్యార్థిని విద్యార్థులకు అవగాహనను కల్పించినారు.ఈ కార్యక్రమంలో ఆటపాక గవర్నమెంట్ హైస్కూల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దయ్య మేలి పలుకులు

కలలోని కోరికలు
ఇలలోన పండాలి
గుండెల్లో ప్రేమలు
పండుగై జరగాలి
చిన్ననాటి బంధము
సన్నజాజి కావాలి
కన్నవారికి పేరు
మిన్నగా తేవాలి
ఎన్ని బాధలొచ్చిన
అన్నింటిని తరమాలి
పిన్న వయసు వారికి
కొన్ని శుభమలివ్వాలి
గొప్ప మనసును కలిగి
మెప్పుగా బ్రతకాలి
తిప్పలెన్ని యున్నా
తప్పక జయించాలి




**గద్వాల సోమన్న**
9966414580

# పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులు సన్నద్ధం అవ్వాలి

### టీచర్ గా మారిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ
### చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలిని టీచర్లకు సూచన





**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 07(వార్తా ప్రభ ప్రతినిధి):**–రానున్న 30 రోజులు అత్యంత కీలక సమయమని...విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే పదో తరగతి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ. అదేవిధంగా వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలని, అత్యవసరమైతే తప్ప శెలవులు పెట్టొద్దని.. ఉపాధ్యాయులను ఆదేశించారు కలెక్టర్.మార్చి 17వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహించన్నున నేపథ్యంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించేందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఇబ్రహీంపట్నం మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు టీచర్ గా మారిన జిల్లా కలెక్టర్ ముచ్చటిస్తూ విద్యార్థుల మేధా శక్తిని పరిశీలిస్తూ పలు ప్రశ్నలు వేశారు. డిజిటల్ బోర్డుపై గణితం, సోషల్ స్టడీస్‌కు సంబంధించి విద్యార్థులతో సమాధానాలు రాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎందరో తమ మేధస్సుతో, నిత్యం నేర్చుకోవాలనే తపనతో ప్రశ్నిస్తూ, నేర్చుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదిగారని.. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి, ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలించి ఏడుగురు ఉపాధ్యాయులు శెలవు పెట్టడాన్ని గమనించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. పరీక్షలు సమీపిస్తున్న ఇలాంటి కీలక సమయంలో చిన్నచిన్న కారణాలతో ఉపాధ్యాయులు సెలవులు వినియోగించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిందన్నారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు సుమారు 40 రోజులు వ్యవధి మాత్రమే ఉందని ఈ సమయం ఎంతో కీలకమైనదన్నారు. ఉపాధ్యాయులు ఆత్మపరిశీలన, నిబద్ధతతో విద్యార్థులపై దృష్టిపెట్టి పరీక్షలకు సన్నద్ధం చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. తద్వారా ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యార్థుల తల్లిదండ్రులలో గౌరవం పొంది పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన వారవుతారన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదవ తరగతి పరీక్షలేనన్నారు. పదవ తరగతి పరీక్ష పాస్ అయితే ఉన్నత చదువులు చదివేందుకు దోహదపడుతుందని లేదంటే ఆ విద్యార్థి జీవితమే చదువు లేని వాడిగా మిగిలిపోతుందని ఈ విషయాన్ని గుర్తించి ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలన్నారు. ఈ దశలో సబ్జెక్టు ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వారికి అర్థమయ్యే రీతిలో బోధించి పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాలన్నారు. నూరు శాతం ఫలితాలను సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు.

# మల్టీనేషనల్ కంపెనీలతో స్థానికులకు ఉపాధి

### ఇబ్రహీంపట్నం మెక్ డొనాల్డ్స్ ప్రారంభించిన జంపాల

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 07 (వార్తా ప్రభ ప్రతినిధి):**–మెక్ డోనాల్డ్స్ లాంటి ప్రముఖ వ్యాపార సంస్థలు ఇబ్రహీంపట్నంలో తమ బ్రాంచ్ ఏర్పాటు చేయటం శుభ పరిణామం అని అన్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెక్ డోనాల్డ్ మెక్ కాఫీ ను శుక్రవారం నాడు ఉదయం జంపాల ప్రారంభించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు జంపాలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవలను పరిశీలించారు జంపాల.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెక్ డోనాల్డ్స్ లాంటి మల్టీ నేషనల్ కంపెనీలు ఇబ్రహీంపట్నం వైపు రావడం సంతోషకరమని, తద్వారా స్థానికంగా ఉన్న యువతి యువకులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అన్నారు. మరిన్ని సంస్థలు దిశగా ప్రయత్నాలు చేయాలని కోరారు. నేరుగా సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇక్కడ బ్రాంచ్ ఏర్పాటు చేయడం సంస్థతో వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మెక్ డోనాల్డ్ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎంఎస్ఎంఈ సర్వేలో వేగం పెంచండి

- పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 07 (వార్తా ప్రభ ప్రతినిధి):**–రాష్ట్ర పారిశ్రామిక శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) సర్వేలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ. మండల పరిధిలోని మూలపాడులో గ్రామ సచివాలయ సిబ్బంది చేస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే కార్యకలాపాలను పరిశీలించారు. వస్త్ర దుకాణం నడుపుతున్న ఓ మహిళ నుంచి వివరాలు సేకరించి, ఎంఎస్ఎంఈ (ఉద్యమ్) సర్వే యాప్‌లో పొందుపరిచే విధానాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అమలవుతున్న వివిధ ప్రభుత్వ ఆర్థిక చేయూత పథకాలను ఉపయోగించుకొని వ్యాపారాన్ని విస్తరించుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేయొచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మహిళకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పోటీతత్వ, ఆరోగ్యకర పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో ఈ సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. పారిశ్రామిక యూనిట్ల అవసరాలపై స్పష్టమైన అవగాహనకు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో సాంకేతిక వినియోగం, నిర్వహణ నైపుణ్యాల్లో లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు కూడా సర్వే ఫలితాలు దోహదం చేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన సర్వేను పూర్తిచేసేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన పౌరుల మిస్సింగ్ డేటాను గృహ డేటాబేస్‌నకు అనుసంధానించే సర్వేని కూడా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



# విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

### .ప్రముఖ విద్యావేత్త ద వెంకటేశ్వర రావు

**మచిలీపట్నం ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని ప్రముఖ ఆర్గానిక్ కెమిస్ట్రీ కింగ్ దిట్ట కవి వెంకటేశ్వర రావు అన్నారు చిలకలపూడి మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ లో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో దిట్ట కవి వెంకటేశ్వర రావు పదవ తరగతి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు విద్యార్థులు ముందుగా తమకు బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయాల న్నారు సమయాన్ని వృథా కాకుండా జాగ్రత్త వహించాలన్నారుప్రీ ఫైనల్ పరీక్షలు పబ్లిక్ పరీక్షలకుఒక సోపానం కావాలన్నారు గత ఏడాది పదవ తరగతి లో చిలకలపూడి స్కూల్ లో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను విమానం పై హైదరాబాద్ తీసుకుని వెళ్ళి ఒక్కొక్క రికి లక్ష రూపాయలు బహుమతి గా ఇచ్చారన్నారు 180 మంది పదవ తరగతి విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారుమళ్ళీ ఈ ఏడాది టౌన్ ఫస్ట్ సాధించాలన్నారు హెచ్ ఎం యువి కృష్ణమూర్తి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ శాస్త్రి తదితరులు మాట్లాడారు



# ఫలించిన బజారు హమాలీల పోరాటం.....!

### సిఐటియు పోరాటంతో 25 శాతం పెరిగిన కూలి రేట్లు....

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** కార్మిక జెండా అండతో మరోసారి కార్మికులు విజయం సాధించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ కూలి రేట్లు పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సమ్మె బాట పట్టిన బజారు హమాలీలు విజయం సాధించి ప్రస్తుత కూలి పై 25% రేట్లను సాధించుకున్నారు. భద్రాచలం పట్టణంలోని బజారు హమాలీలు రెండు రోజుల పాటు సమ్మె బాటపట్టగా శుక్రవారం సిఐటియు నాయకత్వంలో వర్తక సంఘం చర్చలు జరిపి ప్రస్తుత రేట్లపై 25 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ ఎం బి నర్సారెడ్డి మాట్లాడుతూ కార్మికుల కష్టాలను అర్థం చేసుకున్న వర్తక సంఘం వ్యాపారులు సానుకూల వాతావరణం లో చర్చలు జరిపి కూలి రేట్లు పెంచడం అభినందనీయమని అన్నారు. గతంలో చేసుకున్న అగ్రిమెంటు గడువు పూర్తి కావడంతో చాంబర్ ఆఫ్ కామర్స్ కి నోటీస్ ఇచ్చి రేట్ల కోసం కార్మికుల సమ్మె బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల అనుగుణంగా కూలీ రేట్లు లేకపోవడంతో కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని కూలితో పూట గడవని కార్మికులు అనారోగ్య బారిన పడితే ఆదుకునే వారే ఉండటం లేదని అన్నారు. బజారు హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని అనేక దఫాలుగా పోరాటాలు నిర్వహించిన ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు.

## పామూరు పట్టణంలో ఉసా కుటుంబీకుల కలల కల్పవల్లి ఉసా మౌనిక






**కనిగిరి ఫిబ్రవరి 7 వార్తా ప్రభ ప్రతినిధి**కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు, ప్రముఖ కోకోనట్ మర్చంట్ ఉసా మధుసూదన్ రావు శ్రీమతి నారాయణమ్మ దంపతుల కుమార్తె ఉసా మౌనిక చార్టెడ్ అకౌంటెంట్ పూర్తి చేసుకుని ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ అకౌంటెంట్స్ హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియం లో ఐసిఏఐ నిర్వహించిన కన్వొ క్షన్ లో సి ఎ పట్ట తీసుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఉషా మధుసూదన్ రావు, నారాయణమ్మ, సోదరులు వెంకట తరుణ్ కుమార్, వెంకట చరణ్ కుమార్ మౌనికకు అభినందనలు తెలిపారు. పామూరు పట్టణంలోని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిండ్ల నారాయణరెడ్డి, బిజెపి నియోజకవర్గ కొండిశెట్టి వెంకటరమణయ్య, మాజీ సర్పంచులు కావిటి వెంకట సుబ్బయ్య, డివి మనోహర్ ప్రసాద్, జనసేన నాయకులు యలమందల రహీముల్లా, బాలాజీ జ్యువెలర్స్ అధినేత గుత్తి వెంకటరాజా, టిడిపి నాయకులు షేక్ గౌస్ బాషా, ఫత్తు మస్తాన్, షేక్ ఖాజా రహమతుల్లా, మొబీనా మౌలాలి, తదితర టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఊస మౌనికకు అభినందనలు తెలిపి ఆశీర్వచనాలు అందజేశారు.

## మా ఉర్దూ పాఠశాలను విలీనం చేయొద్దు

### తల్లిదండ్రులు గ్రామస్తులు పూర్వ విద్యార్థులు ఆవేదన





**చేజర్ల ఫిబ్రవరి 07 (వార్తాప్రభ)** మండల కేంద్రంలో ఉన్న ఏకైక ఉర్దూ స్కూలుని సమీప దూరంలో ఉన్న మరొక స్కూలులో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ నెల్లూరు జిల్లాలోని చేజర్ల మండలంలోని తిమ్మాయపాలెం ఉర్దూ పాఠశాలలో గురువారం బడి బయట విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ సభ్యులు గ్రామస్తులు నిరసన వ్యక్త పరిచారు.ఇదే విషయంపై ఎస్.ఎం.సి కమిటీ సభ్యులు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం సభ్యులు విలీనాన్ని ఏకగ్రీవంగా తిరస్కరిస్తూ మా ఊరిలోనే మా పాఠశాలలోనే పిల్లలు ఉండి చదువుకునేలా చేయాలని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వైస్ చైర్మన్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పూర్వ విద్యార్థులు మొదలైన వారు పాల్గొన్నారు.

## గంజల్లా బడేసాబ్ స్వాములకు వెండి పాదుకల సమర్పణ



**గోనెగండ్ల.ఫిబ్రవరి 7.(వార్తాప్రభ ప్రతినిధి) :**గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంజల్ల బడేసాబ్ స్వామివారికి శుక్రవారం నాడు గంజహళ్లి వాస్తవ్యులైన పార్లపల్లి శివారెడ్డి గారి మనవడు త్రివిక్రమ్ రెడ్డి మరియు వారి తల్లిదండ్రులు ప్రతాపరెడ్డి, ఆరంజ్యోతి దంపతులు 70 వేల రూపాయల విలువగల వెండి పాదుకలు మొక్కుబడిగా ఇచ్చి చెల్లించుకున్నారు.వారు వెండి పాదుకలను దర్గా ధర్మకర్త కుబేర రెడ్డి మరియు స్వాములవారి ముని మనవడు సయ్యద్ చిన్న ముద్గోల్ గారి సమక్షంలో సమర్పించి భక్తుల దర్శనార్థమై శ్రీ స్వాములవారి జీవ సమాధులకు అమర్చడమైనది.వీరి వెంట దర్గా సొసైటీ అధ్యక్షుడు బడే సాహెబ్,చిన్న కాశీంవలి ఉన్నారు.

## పామూరులో ఘనంగా ముందస్తు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు

**కనిగిరి ఫిబ్రవరి 7 వార్తా ప్రభ ప్రతినిధి**కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో ఘనంగా ఆంటీ నందు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా టిడిపి శ్రేణులు నిర్వహించారు. ముందుగా పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి కేక్ కట్ చేసి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కు తినిపించారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, నిత్య కృషివళుడు, అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆ భగవంతుడు ఎల్లవేళలా ఆయురారోగ్యాలు, సిద్ధించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉగ్రసేన నాయకులు తుమ్మ కొండారెడ్డి, టిడిపి నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, వరికూటి హనుమంతు, చిరంజీవి, ప్రకాశం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉప్పుగళ్ల సురేష్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండిశెట్టి వెంకట రమణయ్య, చావా సుబ్బారావు, రెక్కల రమణారెడ్డి, యరసింగ్ రాయుడు, మట్లె రాహుల్ యాదవ్, తదితర టిడిపి శ్రేణులు భారీగా పాల్గొన్నారు



# ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం జరగదు..

## మాజీ కేంద్రమంత్రి చింతామోహన్



**మచిలిపట్నం ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**ముఖ్యమంత్రుల పదవుల్లో, లక్షల కోట్ల దేశ సంపదలో, సుప్రీం కోర్ట్ జడ్జిల్లో వర్గీకరణ కావాలి. రావాలి. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో రెండు కులాలే 70 ఏళ్లు పరిపాలించారు. సామాజిక న్యాయం అంటే ఇదా? ఆ రెండు కులాలే అధికారాన్ని చెలాయించడం సామాజిక న్యాయమంటారా? ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం జరిగిపోయిందని నాయకులు సంకలు ఎగరేసుకుంటున్నారు. ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం జరగదు. రాజ్యాంగంలో ఎస్సీ ఉపకులాలను విడగొట్టాలని ఎక్కడా రాయలేదు. అవినీతి లేని సమాజం రావాలంటే, ఆదర్శవంతమైన నాయకులు రాష్ట్రానికి, దేశానికి కావాలి. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జిలు తీర్పు ఇచ్చారు. అది ఆర్డర్ కాదు. డిజార్డర్. సుప్రీం కోర్టులో 33 మంది జడ్జీలు ఉంటే, అందులో 20 మంది బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఉన్నారు. సుప్రీంకోర్టు జడ్జిల్లో వర్గీకరణ తేవాలి. దేశ సంపదను ప్రజలందరికీ పంచాలనే గొప్ప ఉద్దేశంతో ఇందిరా గాంధీ ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేసింది. లక్షల కోట్ల దేశ సంపదలో వర్గీకరణ కావాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు బ్యాంకుల రుణాల్లో 50% రుణాలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు దేశ జనాభాలో 25% ఉన్నారు. కానీ బ్యాంకులు ఇస్తున్న అప్పుల్లో ఒక్క శాతం కంటే తక్కువగా ఇస్తున్నారు. మార్వాడీలకు, గుజరాతీలకు బ్యాంకులో అప్పులు ఇస్తున్నాయి. ఎస్సీ ఎస్టీ ఓబీసీలకు బ్యాంకు రుణాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోంది. గుజరాత్ కు చెందిన ఒకాయన 45 వేల కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని, అందులో ఒక్క శాతం కట్టి, మోడీ సహకారంతో 99 శాతం రుణమాఫీ చేయించుకున్నాడు. దేశంలో ధరలు బాగా పెరిగిపోయింది. సామాన్య జనం నిత్యవసర వస్తువులను కొనలేకపోతున్నారు. అన్నింటిపై ట్యాక్స్ లు విపరీతంగా వసూలు చేస్తున్నారు. వాకింగ్ పైన, మొగుడు పెళ్ళానికి ముద్దు పెడితే ఈ రెండింటి పై మాత్రమే పన్ను లేదు. ఎస్సీ వర్గీకరణ పై మిశ్రా కమిషన్ తీరంగా ఖండిస్తున్నాను. వ్యతిరేకిస్తున్నాను. వెంటనే మిశ్రా కమిషన్ను రద్దు చేయాలి. గాంధీ గారు మహాత్మా గాంధీ కావడానికి మచిలీపట్నం కారణమైంది. కానీ బందరు కీర్తి, ప్రతిష్టలు చరిత్రలో అడుగున పడిపోయింది. దేశంలో అంటరానితనం అంటే గాంధీ గారికి తెలిసేలా చేసింది బందరుకు చెందిన ఆనాటి అంటరాని వారే. సౌత్ ఆఫ్రికాలో కూలి పనులకు వెళ్లిన బందరు అంటరాని వారి నుంచి గాంధీ గారు అంటరానితనం గురించి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన ఇండియా కొచ్చి, దేశానికి స్వతంత్రం, అంటరానితనం నిర్మూలన పై దేశమంతా పర్యటించారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, కాంగ్రెస్ పార్టీ కృషి వల్ల అంటరానితనం కొంతవరకు తగ్గించగలిగాము. అంబేద్కర్ రాజ్యాంగ రచన ఆలోచన గాంధీ గారిదే. గాంధీ,నెహ్రూ, అంబేద్కర్ తెలివితేటలు వల్ల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీలకు 15% రిజర్వేషన్లు ఇచ్చింది. సోనియా గాంధీ, అర్జున్ సింగ్ కృషి వల్ల వెనుకబడిన వర్గాలకు 27% రిజర్వేషన్లు విద్య, ఉద్యోగాల్లో కల్పించబడింది. దళిత విభజన కుట్ర పూరిత ఆలోచన. ఈ కారణంగానే రాష్ట్ర విభజనకు దారితీసింది.

## ఎమ్మెల్సీగా ఆలపాటి విజయం లాంఛనమే

### విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**అమరావతి గుంటూరు :ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించడం లాంఛనమేనని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా గుంటూరులోని ఆలపాటి ఇంటికి రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి వెళ్లిన ఆయన.., ఆలపాటికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకు సాగాలంటే... కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆలపాటిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మరో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంత్రులు ఇరువురూ ఆలపాటితో ముచ్చటిస్తున్న సమయంలో కూటమి నేత వంగవీటి రాధ అక్కడకు వచ్చారు. తాజా రాజకీయ పరిస్థితులపై వీరంతా కొద్ది సమయం చర్చించారు. వంగవీటి రాధ కూడా ఆలపాటికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలు అరికట్టడంలో ప్రభుత్వ అధికారుల వైఫల్యం

### వలసలను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్

**నరసరావుపేట,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం చంద్రబాబు నాయుడు కాలనీ చెందిన పేదలు పొట్టకూటి కోసం ఉదయాన్నే నరసరావుపేట నుండి చిలకలూరిపేట వైపు మిరపకాయలు కోయటానికి ఆటోలో వెళుతూ ఉండగా కనపర్తి దగ్గరకు వెళ్ళేసరికి అతివేగంగా వస్తున్న ఒక లారీ ఆటోని క్రాస్ చేస్తూ జరిగిన ప్రమాదంలో 18 మంది పేద వలస కూలీలు ప్రమాదానికి గురి అయ్యారు. తదుపరి నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం తీసుకురాగా ఒకరికి ఇబ్బందికరంగా ఉందని కొంతమందికి కాళ్లు చేతులు విరగటాన్ని చెప్పిన వైద్యులు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ బాధితులను పరామర్శించారు. సంఘటన జరిగిన విషయాలపై జాన్ పాల్ పరిశీలించారు. అనంతరం జాన్ పాల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వలస కూలీలను అరికట్టడానికి ఏర్పాటుచేసిన ఉపాధి హామీ పథకం నీరు గారి పోవటం, ఆపదకు పేదలకు ఉపయోగపడకటం వలన, వలస కూలీలుగా చుట్టుపక్కల ప్రాంతాలకు పొట్టకూటికోసం ప్రతిరోజు ఉదయాన్నే వందలాదిమంది పేదలు ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వారికి ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం చెందాయని జాన్ పాల్ అన్నారు. అలాగే ప్రతిరోజు హైవేలలో యాక్సిడెంట్లు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించడంలో ప్రభుత్వ అధికారులు విఫలం చెందారని, ప్రభుత్వం వలస కూలిలలో అరికట్టటానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, ఇటువంటి ప్రమాదాల వలన కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ ప్రభుత్వాన్ని చేశారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో మాల మహానాడు నరసరావుపేట నియోజకవర్గం వర్కింగ్ అధ్యక్షుడు వుస్తేల జయరావు, కొండా ప్రకాష్ తదితరులు వున్నారు.

## దూడల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**కౌతాళం ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**దూడల పెంపకంలో తగు జాగ్రతలు తీసుకుంటే దూడలు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటాయని ఏ పి ఎల్ డి ఏ రాజశేఖర్ మరియు ఆదోని డిడి రమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం బాపురం గ్రామంలో ఏర్పటు చేసిన దూడల ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ . దూడలకు నట్టల నివారణ మరియు వ్యాక్సిన్లు వేయించాలని మూడు నెలలకు ఒకసారి డి వార్మింగ్ తాగించాలని కోరారు. పశు పోషణ ఆహార సమతుల్యంగా ఉండాలని సంపూర్ణ ఆహారాన్ని అందించాలని పోషకాలు గల ఆహారాన్ని అందించాలని సూచనలు అందించారు. పశువులలో ఈతకు కనీసం నాలుగు నుంచి ఐదు నెలలు మధ్య ఉండాలని సూచనలు ఇచ్చారు. ఎదకు వచ్చిన పశువులను 24 గంటల లోపల ఎద సూదులు వేయించాలని సూచించారు. అనంతరం పుట్టిన దూడలను ర్యాలీగా నిర్వహించారు. అనంతరం రైతులకు టిడిపి నాయకులు మోహన్ రెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు జగదీష్. మహేశ్వరి మరియు టిడిపి నాయకులు మోహన్ రెడ్డి. వెంకటరెడ్డి మరియు సబార్డినేట్ మొహమ్మద్ ఏ హెచ్ ఏ సైఫుల్. గోపాల్ మిత్ర రహీం భాషా పశుమిత్ర అజయ్ రాజకుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులలో పోటీ తత్వాన్ని మేల్కొలిపే సాంకేతిక సదస్సులు

### డాక్టర్ కే రామకృష్ణయ్య





**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 07 (వార్తా ప్రభ ప్రతినిధి):-** సాంకేతిక సదస్సులతో విద్యార్థులలో పోటీ తత్వాన్ని మేల్కొల్ప వచ్చుని ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ కే రామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 6-7 తేదీలలో ఈసీఈ విభాగం మరియు ఐ ఈ టీ ఆధ్వర్యంలో విజయవాడ వారి సహకారంతో అజూర 2కే సాంకేతిక సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే రామకృష్ణయ్య హాజరై మాట్లాడుతూ సాంకేతిక సదస్సులవలన విద్యార్థులలో పోటీ తత్వాం మేల్కొల్పి మరి నీ నూతన సాంకేతిక విధానాలను అలవాటు చేస్తున్నందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ సదస్సులో వివిధ కళాశాలల నుండి సుమారు 200 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారని, పేపర్ ప్రజెంటేషన్,పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ట్రెజర్ హంట్ మరియు ప్రాజెక్ట్ ఎక్స్పో వంటి పోటీలు నిర్వహించి వాటిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందించారు. ఈసీఈ విభాగధిపతి వి వి జి ఎస్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతికతను వెలికి తీయడానికి ఇటువంటి ఇటువంటి సాంకేతిక సదస్సులు దోహదం చేస్తాయని, భవిష్యత్తులో కంపెనీలో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్న కళాశాల యజమానియానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఐ సాయిరాం, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ ఫుట్ బాల్ ఆట ప్రతిభని మెచ్చి లేఖ రాసిన ప్రధాని మోడీ

### చి. తాడిబోయిన శ్రీ లక్ష్మీ యాదవ్ కు జిల్లా విద్యాశాఖ అధికారిణి అభినందన












**గుంటూరు,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**శ్రీ లక్ష్మీ కృషి మరియు అంకితభావానికి దేశ ప్రధాని ప్రశంస లభించడం నిజంగా గర్వించదగిన విషయం. మీ ఆట ద్వారా మీకే కాదు, మొత్తం దేశానికి గౌరవాన్ని తెచ్చారు. ప్రధాని లేఖ శ్రీ లక్ష్మీ కఠిన శ్రమకు మరియు అంకితభావానికి నిదర్శనం. శ్రీ లక్ష్మీ ఇలాగే ముందుకు సాగుతూ మరిన్ని విజయాలను సాధించాలని ఆశిస్తున్నాను. ఆమె విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తుంది! మరొకసారి హృదయపూర్వక శుభాకాంక్షలు అని నరేంద్ర మోడీ నుండి పాఠశాల విద్యార్థిని కి వచ్చిన లేఖను పరిశీలిస్తూ డి. ఈ. ఓ లేఖ పొందిన విద్యార్థిని కి అభినందనలు తెలిపారు. ఫుట్ బాల్ గేమ్స్ లో సాంఘిక నాటక రచయిత టీ తాతారావు యాదవ్ కుమార్తె తాడిబోయిన శ్రీలక్ష్మి ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్ కి పంపించారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన తాడి బోయిన తాతారావు యాదవ్ కుమార్తె తాడిబొయిన శ్రీ లక్ష్మీ యాదవ్ గత సంవత్సరం జరిగిన బీహార్ నేషనల్ ఫుట్ బాల్ గేమ్స్ లో పాల్గొనడం జరిగింది. అలానే అనంతపూర్ లో జరిగిన ఫుట్ బాల్ నేషనల్ గేమ్స్ లో కూడా పాల్గొనడం జరిగింది. పీఎం మోడీ ప్రవేశపెట్టిన వికసిద్భారత్ ప్రోగ్రాంలో భాగంగా ప్రేరణ కార్యక్రమంలో గుజరాత్ లోని ఓడోదరలో వార%శీ% రోజులు మోడీ చదివిన స్కూల్లో శిక్షణ తీసుకోవడం జరిగింది. ఆగస్టు 15 జరిగిన స్వతంత్ర దినోత్సవ కార్యక్రమంలో స్పెషల్ ఇన్వైట్ గా ఆహ్వానం మేరకు ఢిల్లీ వెళ్లి రావడం జరిగింది. క్రాఫ్ట్ సమస్త వారి సహకారంతో ఢిల్లీలో జరిగిన బాలల హక్కులు బాల కార్మికులు బాల్యవివాహాలు సెమినార్లో పాల్గొనడం జరిగింది. మన స్టేట్ నుంచి సెలెక్ట్ అయి వెళ్లి రావటం జరిగింది. గుంటూరు జిల్లాలో జరిగిన వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జరిగిన డిబేట్లో ఫస్ట్ రావడం జరిగింది. ఓటర్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని గుంటూరు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడం జరిగింది. స్కూల్ తరఫున జరిగిన జిల్లా స్థాయి కాంపిటీషన్లో డీఈఓ చేతుల మీదుగా మేమెంటో అందుకోవడం జరిగింది. ఇలా ఆటల్లోనూ, చదువులోనూ రాణిస్తూ ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న తాడి బోయిన శ్రీ లక్ష్మీ యాదవ్ భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో సివిల్స్ కు ప్రిపేర్ అయి ఐఏఎస్ అవ్వాలని తన లక్ష్యంగా ముందుకు వెళ్తున్న శ్రీలక్ష్మికి గుంటూరు జిల్లా యాదవ సంఘం వారు సహాయ సహకారాలు అందించడం జరిగింది. ఇలా చదువుకుంటూ ముందు వెళ్ళటానికి తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, స్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులని కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మంచి స్పాన్సర్స్ ద్వారా ఇంకా గేమ్స్ లో మెలుకువలు నేర్చుకొని దేశానికి పేరు తేవడమే కాక, పేద ప్రజలకు శక్తి మేర సహకారం అందించేందుకు ఐ.ఏ.ఎస్. అవ్వాలని"వార్తా ప్రభ"తో మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ తన లక్ష్యాన్ని తెలియజేసింది

## తహశీల్దారుకు కళాకారుల వినతి

**గుంతకల్లు: ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** గుంతకల్లు పట్టణ సమితి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కళాకారుల కళాక్షేత్రం నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ రమాదేవికి స్థానిక సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కుల్లయప్ప మాట్లాడుతూ కళాకారుల కళాక్షేత్రం కోసం భూమిని మంజూరు చేయాలని వారు విన్నవించారు.

## పాఠశాలను విలీనం చెయ్యొద్దు

### కాకర్లపాడు విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన వినతి



**అనుమసముద్రంపేట ఫిబ్రవరి 7 (వార్తాప్రభ)** తమ గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జమ్మవరం గ్రామంలోని పాఠశాలలో విలీనం చేయొద్దంటూ ఏఎస్ పేట మండలం కాకర్లపాడు గ్రామంలోని పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కాకర్లపాడు గ్రామ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల వద్ద నిరసన చేపట్టి మండల కేంద్రమైన ఏఎస్పేటలోని ఎంఈఓ కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రాన్ని అందజేశారు ఇటీవల గ్రామంలోని పాఠశాలను విలీనం చేసేందుకు అధికారులు సిద్ధం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో గత సుమారు 60 సంవత్సరాల నుండి పాఠశాల ఉందని ఇక్కడ చదువుకుని ఎంతో మందికి ఉపయోగకరం గా ఉందని తెలియజేశారు గ్రామంలోని పాఠశాలను వేరే ప్రాంతానికి మార్చవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు తమ బిడ్డల భవిష్యత్తు కోసం పాఠశాలను కాకర్లపాడు గ్రామంలోనే ఉంచాలని కోరారు. తమకు ఎంతో ఉపయోగక రంగా ఉన్నా పాఠశాలను ఇక్కడే ఉంచాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు .


## వాట్సప్‌లోనే ఏపీ ఇంటర్మీడియట్ హాల్‌టికెట్లు..

### నేటి నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం..

### వాట్సప్ నంబరు 9552300009 ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

**మంగళగిరి, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్‌లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు వాట్సప్ ద్వారా నేటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం 161 సేవలను అందిస్తోంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా వారంతా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. త్వరలో పదో తరగతి విద్యార్థులకూ ఇలాంటి అవకాశం కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి అంటే: ప్రభుత్వం ఇచ్చిన 9552300009 నెంబర్‌కి హాయ్ అనే వాట్సప్?లో మెసేజ్ చేయగానే, సేవను ఎంచుకోండి అంటూ ఒక ఆప్షన్ వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని సేవలు కనిపిస్తాయి. అందులో విద్య సేవలుపై క్లిక్ చేయాలి. అందులో పరీక్ష హాల్ టికెట్ డౌన్?లోడ్?పై క్లిక్ చేయగానే, ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోండి అనే ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్ చేసి, మీ రోల్ నెంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేస్తే హాల్ టికెట్ మీ ఫోన్?లోనే ఎంతో సింపుల్‌గా డౌన్‌లోడ్ అవుతుంది. పరీక్షల షెడ్యూల్: ఏపీలో ఇంటర్మీడిట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి జరగనున్నాయి. మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు, మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి.

## వీరేశలింగం హిందూ హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి అడుగులు



**విస్సన్నపేట ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**స్థానిక మండల కేంద్రంలో వీరేశలింగం హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కొరకు అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీ సర్వే చేయించి బౌండరీస్ ఏర్పాటు చేసి కర్మల భవనం అస్థికల బాక్సులు దహన షెడ్డు మినీ వాటర్ ట్యాంక్ ఎలక్ట్రానిక్ శవ దహన యంత్రం తదితర మౌలిక వసతులు కల్పించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం అందుతుంది. వీరేశలింగం చెరువుకు సంబంధించి నైరుతి భాగంలో ఉన్న మిగులు భూమి 22 ఎ భూమిగా రికార్డులలో నమోదు చేయకుండా రిజిస్ట్రేషన్లకు అనువుగా ఒక రెవెన్యూ అధికారి ఒక రాజకీయ నాయకుని సిఫారసు తో చక్రం తిప్పినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి . గత ప్రభుత్వల పాలనలో కొంత భూమి అక్రమ రిజిస్ట్రేషన్ లు పలు శాఖల సహకారంతో జరిగాయని ఆ భూములకు గృహ నిర్మాణ శాఖ ద్వారా గృహాలు నిర్మించుకునేందుకు రెవెన్యూ శాఖ పరిధిలో పొజిషన్ సర్టిఫికెట్లు కూడా అందించినట్లుగా సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులు వాస్తవ విషయాలను వెలికి తీసి వీరేశలింగం హిందూ స్మశాన వాటిక సంబంధిత భూములను వీరేశలింగం చెరువు మిగులు భూములను విడగొట్టాలని ప్రజల కోరుతున్నారు.

## అన్న క్యాంటిన్ లో సినీ ప్రముఖులు

**విశాఖపట్నం,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**విశాఖలో అన్న క్యాంటీన్ వద్ద ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. రామా టాకీస్ అంబేద్కర్ భవనం వద్ద ఉన్న అన్నా క్యాంటీన్లో డాన్స్ మాస్టర్ ప్రముఖ దర్శకుడు రణం చిత్రం ద్వారా తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న అమ్మ రాజశేఖర్ తో పాటుగా జబర్దస్త్ కమెడియన్ నటుడు ముక్కు అవినాష్ తల చిత్రం ద్వారా హీరోగా పరిచయం అవుతున్న నటుడు రాగిణి రాజ్ లు అన్నా క్యాంటీన్లో భోజనం చేశారు. ముందుగా క్యూలో నిలబడి టోకెన్ తీసుకొని అనంతరం సామా న్య ప్రజలతో కలిసి సంతోషంగా అన్నా క్యాంటీన్లో ఆహారం తీసుకు న్నారు అనంతరం దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ తన కుమారుడు రాగిణి రాజ్ హీరోగా పరిచయం అవుతున్న తలచిత్రం ప్రమోషన్ లో భాగంగా విశాఖ విచ్చేసామని మధ్యాహ్నం ఆకలి గా వేస్తున్న నేపథ్యంలో రామా టాకీస్ రోడ్డులో ప్రయాణంలో అన్నా క్యాంటీన్ వద్ద అన్నం తినేందుకు రావడం సంతోషంగా ఉందన్నారు ప్రభుత్వం పేదల కోసం క్వాలిటీ ఫుడ్ అందించడం ఎంతో శుభ పరిణామం అన్నారు అనంతరం నటుడు అవినాష్ మాట్లాడుతూ పేదవారి కోసం ప్రభుత్వం నాణ్య మైన ఆహారాన్ని అందిస్తుందని ఈరోజు దర్శకుడు అమ్మ రాజశేఖర్ ద్వారా అన్న క్యాంటీన్ రుచి చూడగలిగానని సామాన్య ప్రజలతో కలిసి భోజనం చేయడం తాను జీవితంలో మర్చిపోలేను అన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడమే మా లక్ష్యం

- రూ.500 కోట్ల పెట్టుబడితో హెచ్ సీ రోబోటిక్స్ విస్తరణ
- ఈ ఏడాది కొత్తగా 500 మందికి.. 3 ఏళ్లలో 2వేల మందికి ఉద్యోగాలు
- ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాలకు ఐటీ కంపెనీలు
- మేం పెట్టుబడులు తీసుకొస్తుంటే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటాం.. బకాయిలు చెల్లిస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించి, తెలంగాణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాష్ట్రం లో మరో రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సెంటిలియన్ నెట్ వర్క్స్ కు చెందిన హెచ్ సీ రోబోటిక్స్ ముందుకొచ్చినట్లు వివరించారు. ఆ వివరాలను శుక్రవారం కంపెనీ ప్రతినిధులతో కలిసి సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. "హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా సెంటిలియన్ నెట్ వర్క్స్, హెచ్ సీ రోబోటిక్స్ తొమ్మిది దేశాల్లో డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్ వేర్, టెలి కమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్ వేర్ అభివృద్ధిలో పాటు పలు రంగాల్లో సేవలు అందిస్తూ.. 2వేల మందికి ఉపాధి కల్పిస్తుంది. తాజాగా మరో రూ.500 కోట్లు పెట్టేందుకు ముందుకొచ్చారు. ఫలితంగా ఈ ఏడాది 500 మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయి. ఈ సంఖ్య మూడేళ్ల లో 2వేలకు చేరుతుంది" అని అన్నారు. " ఇప్పటి వరకు ఐటీ రంగంలో పెట్టుబడులన్నీ హైదరాబాద్ కే పరిమితమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల యువతకు ఉద్యోగాలను కల్పించాలనే సంకల్పంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలని సంకల్పించాం. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఆ దిశగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. సెంటిలియన్ నెట్ వర్క్స్ సంస్థ ఇప్పటికే తమ కార్యకలాపాలను కరీంనగర్ లో ప్రారంభించింది. మరికొన్ని సంస్థలు కూడా ముందుకొచ్చాయి" అని వివరించారు. "రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటాం. వీరికి రావాల్సిన ప్రోత్సాహకాలు రూ.4500 కోట్లు 2016 నుంచి పెండింగ్ లో ఉన్నాయి. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిలను చెల్లించేందుకు చొరవ తీసుకున్నాం. సహేతుక కారణాలు చూపకపోతే గతంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలో కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఇతర అవసరాలకు భూములను వినియోగిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ పై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నాం. దీని వల్ల పరిశ్రమలకు మేలు జరుగుతుందని భావిస్తే అధిక నిధులు కేటాయించి పునరుద్ధరిస్తాం" అని చెప్పారు. "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉంది. గతేడాది దావోస్ లో చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 పట్టాలెక్కాయి. 10 ఒప్పందాల పురోగతి 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. కేవలం ఒప్పందాలు చేసుకుని రావడమే కాదు.. వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఈ ఏడాది కూడా మేం రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నాం. మేం ఉద్యోగాలను కల్పించేందుకు పాటు పడుతుంటే.. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ పారిశ్రామికవేత్తలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆరోపించారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నడూ భూసేకరణ పనులను అడ్డుకోలేదు. రాష్ట్రం అభివృద్ధి గురించి ఆలోచించాం. ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతూ అభివృద్ధికి అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నాయి. మాకు రాజకీయాలు కాదు.. రాష్ట్రాభివృద్ధే ముఖ్యం. పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వం తీసుకున్న పాలసీలను కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సెంటిలియన్ నెట్ వర్క్స్ చైర్మన్, ఎండీ వెంకట్, డైరెక్టర్ రాధా కిషోర్, ఆ సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపిఎం పాషా జన్మదిన వేడుకలు

**ములుగు, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** ములుగు నవ భారతి మండల సమైక్య. ఏపిఎం పాషా జన్మదిన వేడుకలను,. సీసీలు, వి ఓ ఏ లు కలిసి గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సీసీలు, వివో ఏలు 50 మందికి పైగా. జన్మదిన వేడుకలలో హాజరై. జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా. సీసీలు, వివో ఏలు తీసుకొచ్చిన కేక్‌ను పాషతో కట్ చేయించి ఆయనకు తినిపించారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపిఎం పాషా మాట్లాడుతూ, నామీద అభిమానంతో నాకు జన్మదిన వేడుకలు నిర్వహించిన సీసీలు వివో ఏలకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే నవభారతి మండల సమైక్య నుండి నాలుగు రోజులపాటు వివిధ పుణ్యక్షేత్రాల దర్శనాలకు వెళుతున్న వివో ఎ, సీసీలు, ప్రయాణంలో ఇలాంటి ఆటంకాలు. కలకుండా వివిధ పుణ్యక్షేత్రాలు దర్శించి తిరిగి క్షేమంగా రావాలని కోరారు, ఈ కార్యక్రమంలో సిసిలు, చంద్రమౌళి సునీత విజయ, లక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్, శరత్, ఎమ్మెస్ అకౌంటెంట్ కిషన్, వివో ఏలు, మాధవి, రమణి, నళిని, కవిత, మానస, కవిత, త్రివేణి, లావణ్య, వనజ, వనిత, అనిత, ధనలక్ష్మి, జయ ప్రద, రమేష్, రవి,అహ్మద్, నరసయ్య, జంపయ్య, సంధ్య, రణధీర్ తదితరులు పాల్గొన్నారు

# ఆపదలో అండగా నిలిచిన మై వేములవాడ ట్రస్ట్

**వేములవాడ, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన ఆరెల్లి విజయ్ కుమారుడు ఊపిరితిత్తులలో రక్తస్రావంతో బాధ పడుతున్నాడు.సిరిసిల్ల కరీంనగర్ హాస్పిటల్స్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్ అంకుర ఆసుపత్రిలో చేర్పించారు.ప్రస్తుతం బాబు ఐసియూలో చికిత్స పొందుతున్నట్లు తండ్రి విజయ్ తెలిపారు. బాబుకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో, ఆపరేషన్ కు ఆర్థిక సాయం అందించాలని బాబు తండ్రి విజయ్ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను కోరాడు. ట్రస్టు వెంటనే స్పందించి, ఆపదలో ఉన్న బాబును ఆదుకోవాలని సోషల్ మీడియాగ్రూపులలో పోస్ట్ చేశారు. అట్టి పోస్టుకు దాతలు స్పందించి, మానవతా దృక్పథంతో 14,319 రూపాయలు ఆర్థిక సాయం అందించడంతో, ట్రస్ట్ సభ్యులు మరి కొంతకలిపి చిన్నారిబాబు ఆపరేషన్ కు 15,000 వేల రూపాయల చెక్కును భాదిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న మై వేములవాడ ట్రస్ట్ కు, దాతలకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, వొడ్యాల వేణు, పొలాస రాజేందర్, తోట రాజు, నంది సాయికుమార్, నాగుల నాగరాజు, చింతల లక్ష్మణ్, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

**హెల్త్ కార్డులపై త్వరలో సమీక్ష**

**టీడబ్ల్యూజేఎఫ్ కుమంత్రి దామోదర రాజనర్సింహ్మా హామీ**



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా తెలిపారు. హెల్త్కేర్డుల విషయంలో త్వరలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులతో సమీక్ష చేస్తానని ప్రకటించారు. ప్రజలు, జర్నలిస్టుల ఆరోగ్యం విషయంలో రాజీపడేది లేదన్నారు. అందుకే ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచినట్టు వివరించారు. శుక్ర వారం హైదరాబాద్లోని బంజారాహిల్స్లో ఉన్న మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధి బృందం మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా హెల్త్కేర్డులు సరిగ్గా పనిచేయడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నా ప్రయివేటు. కార్పొరేట్ ఆసుపత్రులు పట్టించుకోవడం లేదని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందిస్తున్న కొత్త ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని కోరారు. ఉ ద్యోగుల నుంచి వసూలు చేసే ఒక శాతం కంట్రిబ్యూషన్ను జర్నలిస్టులకు సంబంధించి ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి ఈ విషయాన్ని పరిశీలిస్తామని ఫెడరేషన్ నాయకత్వానికి హామీ ఇచ్చారు. త్వరలో ఆరోగ్యశ్రీ అధికారులతో జర్నలిస్టుల విషయమై సమీక్ష చేసి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు గుడిగ రఘు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి. విజయ, హెచ్ఐయూజే అధ్యక్షులు బి. అరుణ్కుమార్, బి. జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కేజీబీవీ పాఠశాలను అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో**



**తొర్రూర్ ఫిబ్రవరి 7 (వార్తా ప్రభ)**తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కేజీబీవీ పాఠశాలను శుక్రవారం, అడిషనల్ కలెక్టర్ వెంట ఆర్డీఓ గణేష్ ఎమ్మార్వో శ్రీనివాస్. మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందించుటకు కృషి చేస్తుందని కావున ఉపాధ్యాయులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం కేజీబీవీ పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ డైనింగ్ హాల్ నీట్ గా ఉండడం చూసి ఉపాధ్యాయులను అభినందించారు. ఆహార నియమాలు పిల్లలకు ఇస్తున్న మెనూ పరిశీలించి పిల్లలకిస్తున్న ఆహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. భోజన రుచికరంగా ఉంటుందా అని పిల్లల్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్టాక్ ఎంత ఉంది పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. టాయిలెట్స్ ని క్షుణ్ణంగా పరిశీలించారు. మున్సిపల్ వాహనం వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టాస్వామి . కేజీబీవీ ప్రిన్సిపల్ శైలజ.హెల్త్ అసిస్టెంట్ రాజు. శానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సత్కారం

**వేములవాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి)** వేములవాడ వాగ్దేవి హైస్కూల్ లో చదువుతున్న నేరేళ్ళ శివ సుధన్వీ, వాణిక చైతన్యలు ఇటీవల హిమాచల్ ప్రదేశ్ లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని, చాంపియన్ ట్రోపి అందుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ లు మున్నూరు కాపు సంఘ భవనంలో శాలువాతో సన్మానించి అభినందించారు. హిమాచల్ ప్రదేశ్ లో క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని చాంపియన్ ట్రోఫీ సాధించిన శివ సుధన్వీ, చైతన్యలు ఈ నెల 28న ఇంటర్ నేషనల్ స్థాయిలో శ్రీలంకలో జరిగే క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొనేందుకు ఎంపిక అవడం జరిగిందన్నారు.భారత దేశం నుండి జరిగే క్రికెట్ మ్యాచ్ లో మన తెలంగాణలోని మన ప్రాంతం నుండి పాల్గొనడం మనకు గర్వకారణం అని కొండ దేవయ్య, పొలాస నరేందర్ లు కొనియాడారు ఇంటర్ నేషనల్ స్థాయిలో, శ్రీలంకలో జరిగే క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు అయ్యే విమాన ప్రయాణం, వసతి సౌకర్యం, బోజన సౌకర్యం తదితర ఖర్చులను స్పోర్ట్స్ అథారిటీ వారు, రాష్ట్ర ప్రభుత్వం భరించాలని ప్రభుత్వాన్ని కోరారు.బీసీ విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ఉన్నప్పటికీ, ఆర్థిక స్థోమత బాగలేనందున రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయాన్ని అందించాలన్నారు.

# స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ సదుపాయాలతో..అత్యాధునికంగా పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్

**- రాష్ట్రంలోనే అతిపెద్ద క్రిటికల్ కేర్ హాస్పిటల్ గా అభివృద్ధి - మొత్తం 150 బెడ్లు.. 8 ఐసీయూలు, 100 క్రిటికల్ కేర్ బెడ్లు - కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్, ట్రామా వైద్య సేవలన్నీ ఒకే చోట.. - 'కార్పొరేట్ క్వాలిటీ.. ఎఫర్డబుల్ రియాలిటీ' నినాదంతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు - పాతికేళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించాం - ప్రపంచ స్థాయి చికిత్సలను అతి తక్కువ ఖర్చులో ప్రజలకు అందించడమే లక్ష్యం - పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు, సీఈవో డాక్టర్ పల్లెం ఆకాశ్ - ఈ నెల 9వ తేదీన నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవం**






**విజయవాడ ఫిబ్రవరి 7 (వార్తాప్రభ ప్రతినిధి):** గడచిన రెండున్నర దశాబ్దాలుగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ను స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మల్టీ స్పెషాలిటీ, ట్రామా, క్రిటికల్ కేర్ సెంటర్ గా ఆధునీకరించామని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద క్రిటికల్ కేర్ సెంటర్ గా ఆధునీకరించబడిన నూతన హాస్పిటల్ ను ఈ నెల 9వ తేదీన లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో, సూర్యారావుపేటలోని పెద్దేశ్వర్ హెల్త్ సెంటర్ నందు శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు మాట్లాడుతూ.. పాతికేళ్ల క్రితం, 1999లో 20 పడకల ఆసుపత్రిగా తమ ప్రస్థానం ప్రారంభమైందని చెప్పారు. అక్కడి నుంచి రెండేళ్లలో 50 పడకల హాస్పిటల్ గా అభివృద్ధి చేశామని, 2007లో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుచేశామని, 2011లో బైపాస్ సర్జరీలను ప్రారంభించమని తెలియజేశారు. ఈ రెండున్నర దశాబ్దాల ప్రయాణంలో అనేక మైలురాళ్లను విజయవంతంగా అధిగమించామని.. 100 పర్సెంట్ సక్సెస్ రేటుతో ఏడువేలకు పైగా బెలూన్ యాంజియోప్లాస్టీలు నిర్వహించామని, 31 వేలకు పైగా యాంజియోగ్రాంలు, 99.97 శాతం సక్సెస్ రేటుతో 5,747 సీటీ సర్జరీలు, వంద శాతం సక్సెస్ రేటుతో 1,366 ప్రైమరీ పీటీసీఏఎస్ చికిత్సలు చేశామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు అత్యాధునిక పరిజ్ఞానాన్ని సముపార్జించుకుంటూ 10 లక్షల మందికి పైగా పేషెంట్లకు చికిత్సలందించామని పేర్కొన్నారు. 'కార్పొరేట్ క్వాలిటీ.. ఎఫర్డబుల్ రియాలిటీ' నినాదంతో ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. గతేడాది హాస్పిటల్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన తన కుమారుడు డాక్టర్ పల్లెం ఆకాశ్ నేతృత్వంలో, ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందించాలనే సంకల్పంతో ప్రపంచ స్థాయి సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ సెంటర్ గా పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటరును అభివృద్ధి చేశామని డాక్టర్ పెద్దేశ్వరరావు వివరించారు. అనంతరం, డాక్టర్ పల్లెం ఆకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అతిపెద్ద క్రిటికల్ కేర్ సెంటర్ గా తమ హాస్పిటల్ ను తీర్చిదిద్దామన్నారు. మొత్తం 150 బెడ్లు.. 8 ఐసీయూలతో 100 క్రిటికల్ కేర్ బెడ్లతో వివిధ విభాగాల వైద్య సేవలను ఒకేచోట అందిస్తామని తెలిపారు. కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్, ట్రామా తదితర విభాగాలకు సంబంధించిన అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ నందు సేవలందిస్తారని డాక్టర్ ఆకాశ్ వివరించారు. ఈ నెల 9వ తేదీ జరిగే ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, స్టార్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ మన్నం గోపీచంద్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ సీహెచ్. ప్రసాద్ బాబు, డాక్టర్ ఎస్. భాను ప్రభాకర్, డాక్టర్ వి. సుశాంత్ రెడ్డి, డాక్టర్ సింధు చాగంటి, డాక్టర్ పవన్ సాయి పోతుల, డాక్టర్ కె. శ్రీనివాస్ బాబు, డాక్టర్ రామ్ ప్రతాప్ కొనకళ్ల, డాక్టర్ కె. రామ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జ్యోతి కాలనీలో దేవి బేకరీని ప్రారంభించిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ **జవహర్ నగర్, ఫిబ్రవరి, 07:(వార్తా ప్రభ)**

# సగ్గుబియ్యంతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు..!

**ఎన్ని సమస్యలు దూరమవుతాయో తెలుసా..?**



సగ్గుబియ్యం తయారు చేయడంలో కర్రపెండలం తొలగించి శుభ్రం చేసిన తర్వాత దాన్ని పెండలంలో నుంచి తీసుకుని చెరకు రసం తీసినట్లు ద్రవ పదార్థం పొందుతారు. ఈ పదార్థాన్ని చిక్కగా చేసుకొని రంధ్రాలున్న జల్లెడ ద్వారా కదపించి చిన్న చిన్న గుండ్రని పూసల్లా రూపాలను కలిగి ఉంటుంది. తదుపరి వీటిని పెద్ద పెనంపై వేడి చేసి ఎండలో ఆరబెట్టి ఉపయోగించడానికి సిద్ధం చేస్తారు.సగ్గుబియ్యంలో ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి సమృద్ధిగా ఉంటాయి. ఇవి గర్భిణీ మహిళల ఆరోగ్యానికి చాలా మంచివి. గర్భధారణ సమయంలో తల్లి శరీరాన్ని, శిశువు అభివృద్ధిని మెరుగుపరచటానికి సహాయపడతాయి. ఇవి మధుమేహం ఉన్నవారికీ మంచివి, ఎందుకంటే ఇందులో తీపి పదార్థాలు లేకపోవడం వలన ఎలాంటి దుష్ప్రభావాలు లేవు.సగ్గుబియ్యంలో కాల్షియం, ఐరన్, విటమిన్ K వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, రక్త ప్రసరణను కూడా కాపాడతాయి. సగ్గుబియ్యం ప్రోటీన్‌ను జోడించి తీసుకుంటే కండరాలు బలంగా తయారవుతాయి, శారీరక శక్తిని పెంచడంలో ఇది సహాయపడుతుంది. కండరాల సమస్యలు కూడా తగ్గుతాయి. ప్రత్యేకంగా ప్రోటీన్‌తో కలిసి తీసుకోవడం చాలా మంచిది.సగ్గుబియ్యం తక్కువ బరువు ఉన్నవారికి చాలా సహాయపడుతుంది. ఇది మంచి బరువు పెరిగే విధానాన్ని సూచిస్తుంది. సరిగ్గా వాడితే శరీరంలోని అవసరమైన కొవ్వును పెంచకుండా బరువు పెరిగేలా సహాయపడుతుంది. కానీ అధిక కేలరీలు ఉన్న పదార్థాలతో కలిపి వాడకూడదు.సగ్గుబియ్యం డైటరీ ఫైబర్‌ను అధికంగా కలిగి ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ ఫైబర్ శరీరంలో హెల్దీ గట్ ఫ్లోరాను ప్రోత్సహిస్తుంది. ఇంకా గ్లూటెన్ లేని ఆహారం కావడంతో అలర్జీలు ఉన్నవారు సురక్షితంగా తీసుకోవచ్చు.సగ్గుబియ్యాన్ని ఉపవాస సమయంలో తీసుకోవడం చాలా ప్రయోజనకరమైనది. ఇది తక్షణ శక్తిని అందించే ఒక శక్తివంతమైన ఆహారం. కిచిడీ లేదా పాయసం వంటి వంటల రూపంలో తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తిని అందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

## ఖాళీ కడుపుతో గుడ్లు తింటున్నారా..?

## యమ డేంజర్.. సమస్యలు కొనితెచ్చుకున్నట్టే

గుడ్డులో అధిక నాణ్యత గల ప్రోటీన్ ఉండటంతో పాటు, విటమిన్ ఎ, డి, ఇ, బి12, రిబోఫ్లేవిన్, ఫోలేట్, ఐరన్, సెలీనియం వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. గుడ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కానీ ఈ గుడ్లను తప్పుడు మార్గంలో తీసుకుంటే, అవి ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చే బదులు హాని కలిగించడం ప్రారంభిస్తాయి. అవును, కొంతమంది ఉదయం పనికి చేరుకోవాలనే తొందరలో అల్పాహారంగా ఖాళీ కడుపుతో గుడ్లు తింటారు.మనలో చాలా మంది గుడ్లు ఇష్టంగా తింటుంటారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు తినేవారు కూడా ఉంటారు.. గుడ్డులో ప్రోటీన్లు పుష్కలంగా ఉండటంతో ఫిట్‌నెస్ ప్రియులు దీనిని ఎక్కువ తినడానికి ఇష్టపడుతున్నారు. కొంతమంది పచ్చి గుడ్డు కూడా తింటుంటారు. మరికొందరు ఆమ్లెట్ వేసుకుని తింటారు. కానీ, ఉడికించిన గుడ్లు ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఖాళీ కడుపుతో గుడ్లు తినడం సురక్షితమేనా అన్న విషయాన్ని మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? మీరు కూడా అల్పాహారం కోసం ఖాళీ కడుపుతో గుడ్లు తింటున్నట్టయితే, ఈ విషయాలు తప్పక తెలుసుకోవాలంటున్నారు పోషకాహార, వైద్య ఆరోగ్య నిపుణులు .గుడ్డులో అధిక నాణ్యత గల ప్రోటీన్ ఉండటంతో పాటు, విటమిన్ ఎ, డి, ఇ, బి12, రిబోఫ్లేవిన్, ఫోలేట్, ఐరన్, సెలీనియం వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. గుడ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కానీ ఈ గుడ్లను తప్పుడు మార్గంలో తీసుకుంటే, అవి ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చే బదులు హాని కలిగించడం ప్రారంభిస్తాయి. అవును, కొంతమంది ఉదయం పనికి చేరుకోవాలనే తొందరలో అల్పాహారంగా ఖాళీ కడుపుతో గుడ్లు తింటారు. కానీ, ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఇలా చేయడం సరైనది కాదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.ఖాళీ కడుపుతో గుడ్లు తినడం వల్ల కొంతమందికి ఉబ్బరం, గ్యాస్, కడుపు తిమ్మిరి వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. జీర్ణవ్యవస్థ ఇప్పటికే బలహీనంగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. కొంతమందికి గుడ్లు అలెర్జీ కలిగి ఉంటారు. అలాంటి వారు పొరపాటున కూడా ఖాళీ కడుపుతో గుడ్లు తినకూడదు. అలాంటి పొరపాటు చేయడం వల్ల, చర్మంపై తామర, శరీరంలో వాపు, వికారం, వాంతులు లేదా విరేచనాలు వంటి జీర్ణశయాంతర సమస్యలతో బాధపడాల్సి వస్తుంది. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఉదయం ఖాళీ కగుడ్లలో ఉండే మంచి మొత్తంలో ప్రోటీన్ కొన్నిసార్లు కొన్ని యాంటీబయాటిక్స్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. అటువంటి పరిస్థితిలో ఏదైనా యాంటీబయాటిక్స్ తీసుకునేటప్పుడు మీరు వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే మీ ఆహారంలో గుడ్లను చేర్చుకోండి.

# 15వ మహా గజమాలయాత్రను ప్రారంభించిన చిలకలపూడి పాపారావు



**కృతివెన్ను,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ కు యజమాలను సత్కరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా బంటుమిల్లి మండల పరిధిలోని చోరంపూడి సెంటర్ నుంచి కోపనాతి కృష్ణమ్మకు సమర్పించు మహా గజమాల యాత్రను మిస్ గ్లోబల్ ఆసియా 2025 భావన రెడ్డి తో కలిసి ప్రారంభించిన అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు. ఈ సందర్భంగా యాత్ర కన్వీనర్ కొల్లు సుబ్రహ్మణ్యం మరియు కమిటీ సభ్యులు అగ్నికుల క్షత్రియుల నాయకులు చైర్మన్ పాపారావును శాలువాతో పూలదండలతో సన్మానించారు. తదనంతరం చైర్మన్ కమిటీ సభ్యులను మరియు మిస్ గ్లోబల్ ఆసియా 2025 భావన రెడ్డిని చాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు కార్పొరేషన్ డైరెక్టర్లు పీత గోపీచంద్, తిరుమల శెట్టి చంద్రమౌళి, అగ్నికుల క్షత్రియ నాయకులు బడుగు శ్రీకాంత్, లంకేష్ సురేష్ వర్మ, చెన్ను శ్రీనివాసరావు, పీతా సుబ్బారావు, తమ్ము బాబు తదితరులు పాల్గొన్నారు....

# రామ సుశీల శివప్రసాద్ నవ దంపతులకు కొండంత ఆశీస్సులు

**విస్సన్నపేట,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నిగామాను సూరిబాబు కుమార్తె రామ సుశీల వివాహ కార్యక్రమానికి ఎన్డీఏ పక్ష నాయకులు మీడియా సోదరులు హాజరై నూతన దంపతులకు తమ ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిజెపి జనసేన పార్టీల నాయకులతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా శాటిలైట్, మూడు యూట్యూబ్ చానల్స్ ఎడిటర్ మరియు మీడియా మిత్రులు పాల్గొన్నారు.



# వెల్వడంలో డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



**మైలవరం,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** మండలంలోని వెల్వడం గ్రామంలో ప్రవాస భారతీయులు లకిరెడ్డి హనిమిరెడ్డి స్వంత నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ జన్మభూమి పై మమకారంతో లకిరెడ్డి హనిమిరెడ్డి వెల్వడం గ్రామం అంతా సిమెంటు రహదారులు,పక్కా డ్రైనేజీలు నిర్మించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే వెంట ఎన్డీఏ కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు అందించిన గోపు సత్యనారాయణ

**మచిలీపట్నం,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** విద్యార్థులకు ఆటలు మానసిక ఉల్లాసంతో పాటు శారీర దృఢత్వాన్ని పెంచుతాయని తెలుగుదేశం జిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు పంచాయతీ లోని హైస్కూల్ నందు నిర్వహించిన ఆటల పోటీలలో ప్రథమ ,ద్వితీయ ,తృతీయ స్థానాలు గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. బహుమతులు గోపు సత్యనారాయణ గారి చేతుల మీదుగా తాళ్లపాలెం హైస్కూల్ లో జరిగిన సబ్ జోన్ టెన్నికాయిట్ , కబడ్డీ లో విన్నర్స్, కోకో లో రన్నర్స్ , సెంట్రల్ జోన్ టెన్నికాయిట్ రన్నర్స్ గా గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు , దివి మహేష్ , ఉపాధ్యాయులు బొమ్మిడి ఏడుకొండలు , గ్రామస్తులు గోపు నరేష్ , ఈవన యేసు , గమిడి ఇమ్మానియేలు , గమిది ప్రదీప్ , గమిడి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# 9, 10, 11 తేదీల్లో మహా సభలు




**కాకినాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** గత 553 సంవత్సరాలుగా అర్ష, సూఫీ సిద్ధాంతాల స్ఫూర్తితో శ్రీ విశ్వవిజ్ఞాన, విద్య, ఆధ్యాత్మిక పీఠం సర్వమత సమ్మతమైన ఈశ్వర ఏకత్వ ప్రతిపాదనతో ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రభోదిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడు తూ విశ్వ మానవ కల్యాణానికి కృషి చేస్తూ ఉందని పిఠాపురం శ్రీ విశ్వవిజ్ఞాన, విద్య, ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా పేర్కొన్నారు. పిఠాపురం శ్రీ విశ్వవిజ్ఞాన, విద్య, ఆధ్యాత్మిక పీఠం 97వ వార్షిక ఆధ్యాత్మిక మహాసభలు ఈ నెల 9,10,11 తేదీల్లో పిఠాపురం మహారాజా రైల్వే వారధి వద్ద గల పీఠం నూతన ఆశ్రమంలో ఘనంగా జరగనున్నాయి. ఈ మహాసభలకు సంబంధించి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా పీఠం నూతన ఆశ్రమంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ముందుగా సమాచార కేంద్రాన్ని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే పుస్తకాల ప్రదర్శనా స్టాలును పిఠాపురం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జానీబాషా, సీనియర్ జర్నలిస్ట్ తంగిశెట్టి మధుసూదనరావు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం ప్రతినిధులు ఎన్టీవీ వర్మ, ఆకుల రవితేజ, ఈవేళ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు..

# నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీ. సీ. కెమరాలు ఉపయోగ పడతాయి - ఎస్. ఐ. అర్జున్

**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్ఐ అర్జున్ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగాఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు.



# ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ పోస్టర్ ఆవిష్కరణ



**గుడివాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఎమ్మెల్సీ అభ్యర్థి కే.ఎస్ లక్ష్మణ్ రావు విజయాన్ని కాంక్షిస్తూ ది కృష్ణ జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ జి 1560 సిఐటియు అనుబంధం ఆటోనగర్ గుడివాడ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశంలో నామినేషన్ రోజు అనగా ది 10.02.2025 న ఆటోనగర్ నుండి పది కార్లలో 50 మంది వెళ్లాలని సమావేశంలో తీర్మానించగా.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి పాల్గొనగా, అలాగే యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ అలియాస్ అమీర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి లక్ష్మణరావు, నాయకులు బొబ్బరపల్లి ఆంజనేయులు, రాజు బోయిన వీర్రాజు, సరే ఎస్. ఎం మొహిద్దీన్ బాషా, అన్నమనేడి వెంకట రమణ, గేదెల త్రినాద్, వద్లని గాంధీ, ఎస్. కే కాజా, అబ్దుల్ ఖలీల్, మహాదేవ, ఆది నారాయణ, కల్వకుంట నాగరాజు, మాదిరి శ్యామ్ కుమార్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ సేఫ్టీ యాప్‌లను శక్తి టీంతో డౌన్లోడ్ చేయించిన 2టౌన్ ఎస్.ఐ జాస్మిన్

**గుడివాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా ఎస్పి ఆర్.గంగాధర్ ఆదేశాల మేరకు గుడివాడ డిఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో గుడివాడ టూటౌన్ సి.ఐ చిన్ని నాగప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో విద్యార్థుల స్మార్ట్ ఫోన్లో ఉమెన్ సేఫ్టీ ఆప్ డౌన్లోడ్ చేయించి ఫ్యూచర్స్ గురించి టూటౌన్ ఎస్.ఐ జాస్మిన్ వివరించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ యాప్‌లను శక్తి టీంతో డౌన్లోడ్ చేయించినట్లు తెలిపారు. విద్యార్థులు, మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్‌ను వినియోగిస్తే సకాలంలో పోలీస్ శాఖ స్పందించి రక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల విజయం కోరుతూ మంత్రి సుభాష్ విస్తృత ప్రచారం

● మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపు



**రామచంద్రపురం, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం విస్తృత పర్యటన చేపట్టారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపుకు విద్యావంతులంతా కృషి చేయాలని కోరారు. తొలుత శుక్రవారం రామచంద్రపురంలోని విఎస్ఎం కళాశాలలో సిబ్బందిని, విద్యార్థులను కలిసి కూటమి అభ్యర్థి రాజశేఖర్ కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం అన్నయ్య పేట,తోటవారి వీధి, గుబ్బలవారి పేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం చేకూరుస్తుందని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో విద్యావంతులు కూటమి పక్షాన నిలబడి సంపూర్ణ మద్దతు ఇచ్చారని, అదే వరవడి కొనసాగించి కూటమి అభ్యర్థి రాజశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రుల సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు, సేవాగుణం కలిగిన రాజశేఖర్ ను బలపరచాలని కోరారు. రాష్ట్ర పురోభివృద్ధిని కోరుకునే విద్యావంతులంతా కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఊహించని రీతిలో రాష్ట్ర అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా సాగుతున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలన స్వర్ణాంధ్ర విజన్ -2047 దిశగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం,రామచంద్రపురం ఎన్నికల పరిశీలకులు కాకినాడ రామారావులు మాట్లాడుతూ బూత్ ఇన్చార్జిలు, కూటమి నాయకులు గ్రామ గ్రామాన, ప్రతీ ఓటరును కలిసి కూటమి ప్రభుత్వ లక్ష్యం,గత ఎనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధి,సంక్షేమం వివరిస్తూ ఓటు అడగాలని సూచించారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# మద్రాస్ క్షేత్ర పర్యటనలో ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు

**మైలవరం,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విద్యార్థులు మద్రాస్ ఎడ్యుకేషనల్ టూర్ కి వెళ్లి నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి శుక్రవారం తెలియజేశారు. ఈ టూర్ లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు మద్రాస్ యూనివర్సిటీ పాటని విభాగాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పరిశోధనలపై వివరాలను తెలుసుకున్నారని వెల్లడించారు. మద్రాస్ యూనివర్సిటీ లో సెంట్రల్ ఇన్స్ట్రుమెంట్స్ లాబరేటరీ లో ఉన్న స్కానింగ్ ఎలక్ట్రో మైక్రోస్కోప్, రివర్స్ ట్రాన్స్క్రిప్షన్ పి.సి.ఆర్ లాంటి అత్యధిక అత్యాధునిక పరికరాల గురించి అవగాహన,పనిచేసే విధానాన్ని తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బిర్లా ప్లానెటోరియంలోకి వెళ్లి గెలాక్సీ లో ఉన్న వివిధ నక్షత్రాలను మరియు సూర్య కుటుంబంలో ఉన్న గ్రహాలను వీడియో ద్వారా తిలకించారు. మద్రాస్ గవర్నమెంట్ మ్యూజియంలో చోళులు , చాళుక్యులు , రాష్ట్ర కోటలు, షోడ జానపదాల కాలంలో వాడిన వివిధ రకాల వస్తువులు, ఆయుధాల గురించి ప్రత్యక్షంగా చూసి తిలకించారన్నారు. వివిధ రకాల శిల్పాలు వివిధ రకాల నాణేలను గురించి కూడా ప్రత్యక్షంగా తిలకించి వాటిపై అవగాహన పొందారు. అక్కడే ఉన్న గవర్నమెంట్ మ్యూజియం లో వృక్షశాస్త్ర మ్యూజియంలో అనేక మొక్కల హెర్బేరియం లను, జంతు శాస్త్రంలో అనేక రకాల పక్షులు స్పెర్మ్ వేల్ స్కెలిటన్, ఆస్ట్రిచ్ వివిధ రకాల పక్షులు జంతువులు నమూనాలను ప్రత్యక్షంగా తిలకించడం జరిగిందని తెలిపారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద లైబ్రరీ చెన్నైలోని అన్న సెంటినరీ లైబ్రరీ ను సందర్శించి అక్కడ కొన్ని లక్షల పుస్తకాలు ఎలా సేకరించినారో వివరాలు అడిగి తెలుసుకున్నారని,అలాగే 8వ అంతస్తు లో ఉన్న డిజిటల్ లైబ్రరీని సందర్శించిన్నట్లు తెలియజేశారు. ఏడవ అంతస్తులు గల సుమారు 75 వేల తాళపత్ర గ్రంథాలను చూసి , ఆ రోజుల్లో తాళపత్రాలు ఎలా ఉండేవో వాటిని ప్రత్యక్షంగా చూసి విద్యార్థులు ఆనంద భరితులయ్యారన్నారు. ఇంకా అనేక ప్రదేశాలను సందర్శించినట్లు కళాశాల వృక్ష శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జె.రాముడు తెలియజేశారు.



# అధిక మోతాదులో రసాయన మందుల వినియోగం అనర్థం..



**చల్లపల్లి: అవనిగడ్డ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తలు స్థానిక మోపిదేవి మండలం , చల్లపల్లి మండలం లోని నూకల వారి పాలెం గ్రామంలో మినుము పంటను పరిశీలించారు. కృష్ణా జిల్లాలో అన్ని ప్రాంతాలలో మినుము పంటకు అధికముగా రసాయన మందులతో పాటుగా బలం మందులను కలిపి పిచికారీ చేస్తున్నారని, వీటిని అధిక మోతాదులో వినియోగించడం ద్వారా పైరు రొట్ట గా పెరిగి పూత రావడం ఆలస్యమవుతుంది కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా సుధా రాణి రైతులకు వివరించారు. చీడ పీడల నివారణకు సూచించిన రసాయన మందులు కూడా నిర్దేశించిన మోతాదులోనే పిచికారీ చేసుకోవాలని మోతాదుకు మించి కానీ తక్కువ మోతాదు కానీ పిచికారీ చేయకూడదు అని తెలియచేసారు. ప్రస్తుత కాలంలో మినుము పంటను కాండం గజ్జి తెగులు ఆశించి నష్టపరుస్తుందని, మొక్కలు వడలి చనిపోతున్నాయని తెలిపారు. నీటి తడి అందిన తర్వాత మొక్కలు చనిపోయి తెగులు వ్యాప్తి ఎక్కువ అవుతుందని, దీని నివారణకు మెటలాక్సిల్ం మాంకోజెబ్ మందును 300 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ 300 మీ.లీ ఎకరానికి చొప్పున నేల తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆకులపైన పిచికారీ చేసుకుంటే ఈ తెగులు ఉధృతి తగ్గదని తప్పనిసరిగా నేలను మందుతో తడపాలని సూచించారు తద్వారా శిలీంద్రం వ్యాప్తి తగ్గుతుందని సుధా రాణి వివరించారు. ఈ కార్యక్రమంలో డా. రేవతి మరియు డా. వెంకట లక్ష్మీ, చల్లపల్లి వ్యవసాయ అధికారిని సాయి సింధు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

**ఈనెల 15లోపు కేవైసి చేయించుకోవాలి..** పంట నమోదు మరియు రైతుల కేవైసీ రబి పంటకి జరుగుతున్నందున ప్రతి రైతు రబీ సీజన్లో వేసిన పంట మినుము పెసర మొక్కజొన్న ఇతర పంటలు మీ పొలం ఉన్న గ్రామ రైతు సేవా కేంద్రం నందు వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకుని ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారిణి జి.సాయిసింధు సూచించారు . ఫిబ్రవరి 15వ తారీకు లోపు పంట నమోదు కేవైసి పూర్తి చేయాల్సి ఉన్నందున అందరు రైతులు సహకరించాలని ఆమె కోరారు.

# ప్రాంగణ నియమకాల్లో ఆదిత్య డిగ్రీ విద్యార్థుల జయభేరి




**గుడివాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ప్రాంగణ నియమకాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల గుడివాడ విద్యార్థులు జయభేరి మోగించారని ప్రిన్సిపల్ రవీంద్ర బాబు తెలిపారు. కాకినాడ లో జరిగిన ప్రాంగణ నియమకాల్లో 5 మంది విద్యార్థులు ఐ ఎల్ ఎమ్ కంపెనీ లో 4 గురు విద్యార్థులు మరియు సంధ్య ఆక్వా లో ఒక్క విద్యార్థి ఎంపిక అయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కూడా ఆదిత్య విద్యార్థుల హవా చూపించారని అన్నారు. ఇంకా డిగ్రీ అవ్వకుండా 6వ సెమిస్టర్ లో ఉండగానే, టిసిఎస్-బిపిఎస్, మిలేకల్ హెటెరో డ్రగ్స్ లో ఇప్పటికే విద్యార్థులు సెలెక్ట్ అయ్యారని తెలియచేసారు. ఇంకా పలు కంపెనీలు వరుసగా ఉన్నాయని, వాటిలో ఉద్యోగాలు సాధించటం కోసం విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ సుగుణ రెడ్డి, అకాడమిక్ డైరెక్టరు నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, టిపిఓ రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్పాహారమునకు చేయూతనిచ్చిన దాతలు



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** స్థానిక అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 5వ తారీఖు నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పౌష్టికాహారమును ఏర్పాటు చేయడం జరిగింది. గరికపాటి చంటి, వడ్డీ వాసవి, లావేటి వేంకటేశ్వరరావు (దంటగుంట్ల) మొదలగు గ్రామ పెద్దలు వారు 10 వేల రూపాయలను ప్రధానోపాధ్యాయులు తోట పుష్పావతి కి అందించారు. ఎస్ఎంసి సభ్యులు విద్యార్థులకు అల్పాహారమును సమకూర్చుటకు ముందుకు వచ్చారు.

# రైతులందరికీ ఈకేవైసీ చేయాలి.. ఏవో అనంతలక్ష్మి

**గుడివాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** రబీ పంట నమోదు చేసుకున్న రైతులంద రికీ ఈకేవైసీ నమోదు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి బోలెం అనంతలక్ష్మి అన్నారు. మండల వ్యవ సాయ శాఖ కార్యాలయంలో గురువారం ఏఈవోలకు, వీఏఏలకు వివిధ అంశాలపై శిక్షణా తరగతులు జరిగాయి. ఆన్లైన్లో రైతుల వివరాలు, భూముల వివరాలను నమోదు చేయించాలని తెలిపారు. పంటకోత ప్రయోగాలు, ఫారమ్ 1లో వెంటనే సబ్మిట్ చేయాలని కోరారు. ఏఈవో వి. అనిత, దేవన బోయిన అనూష తదితరులు పాల్గొన్నారు.

**బూడిద, పల్లాకు తెగులు నివారణ చర్యలు చేపట్టాలి..** మినుముపై బూడిద, పల్లాకు తెగులు చర్యలు చేపట్టాలని ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త లహరి అన్నారు. గుడివాడ మండల పరిధిలోని రామనపూడి తదితర గ్రామాల్లో గురువారం మినుము పంటను ఆమె పరిశీలించారు. ఆకుకు తెగులు వస్తే ఆ మొక్క తొలగించాలన్నారు. వ్యవసాయ శాఖ మండల విస్త రణాధికారిణి దేవనబోయిన అనూష, రైతులు పాల్గొన్నారు.

# 9న తుమ్మలపల్లిలో మానవత ఉచిత వైద్య శిబిరం

శాంతిజీవనం
మానవత

**గుడివాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** నియోజకవర్గ పరిధిలోని నందివాడ మం॥ తుమ్మలపల్లి అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 9వ తేది ఆదివారం ఉదయం 9.30నిల నుండి మధ్యాహ్నం 2 గం॥ల వరకు విష్ణు ల్యాబ్స్ గుడివాడ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో డా॥ పంపన సూర్య శరత్ కుమార్, డా॥ బండారు అంకిత, డా॥ గొట్టిపాటి చైతన్య కృష్ణ లు వైద్య సేవలు అందిస్తారన్నారు. అలాగే లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే ఉచితంగా కంటి పరీక్షలు చేసి కంటి శుక్లాల ఆపరేషన్స్ ఉచితంగా చేయబడుతుందన్నారు. అవసరమైన వారికి నాణ్యమైన కళ్ళజోళ్ళు అందజేయబడతాయన్నారు. దంతవైద్యులచే దంతాలు, పరీక్షలు ఉచితంగా చేయబడతాయని వారు పేర్కొన్నారు.

# నేడు అష్టలక్ష్మి ఆలయంలో త్రయోదశి వార్షిక మహోత్సవం



**గుడివాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** గుడివాడ రూరల్ మండలం చిన్నఎరుకపాడు శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో 8వ తేది శనివారం త్రయోదశి వార్షిక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గం॥లకు భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి అష్టోత్తర శత కలశ స్నపన, పంచామృతాభిషేకం, ధ్వజారోహణ, 7గం॥లకు అష్టలక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన, 10గం॥లకు శ్రీలక్ష్మీ నారాయణ శాంతి కళ్యాణోత్సవం, మధ్యాహ్నం 12.30ని॥లకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. మరల 12 వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం నిర్వహించే శాంతి కళ్యాణంలో పాల్గొనాలనుకునేవారు 516 రూ॥లు మరియు బుధవారం అమ్మవారి శాంతి కళ్యాణంలో పాల్గొనే భక్తులు 300 రూ॥ ముందుగా చెల్లించి తగు రశీదు పొందాలన్నారు. ఈ కార్య క్రమాలను విజయవంతం చేయాలని శ్రీ గణపతి సచ్చిదా నంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మ ణ్యేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

## స్టెమి గుండెకు భరోసా అవగాహన సదస్సు



**నందిగామ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** పట్టణంలోని డివిఆర్ ఏరియా హాస్పిటల్ నందు గుండె జబ్బుల కారణంగా సంభవించే ఆకస్మిక మరణాలను నివారించేందుకు "స్టెమి గుండెకు భరోసా" అనే అవగాహన సదస్సును హాస్పిటల్ ఇన్చార్జి, సూపరింటెండెంట్ డాక్టర్ సీతారావమ్మ అధ్యక్షతన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరావు సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. చాతి నొప్పి, భుజం లాగడం, ఆయాసం,గుండె దడ మరియు స్పృహ కోల్పోవడం వంటి గుండెపోటు లక్షణాలు కలిగినప్పుడు మొదటి గంటలోపే ఏరియా హాస్పిటల్నకు తీసుకొని వచ్చిన ఎడల 45 వేల రూపాయల ఖరీదు గల ఇంజక్షన్ ఉచితంగా నందిగామ హాస్పిటల్ నందు అందించడం జరుగుతుందన్నారు. విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్ లోగల గుండె వైద్య నిపుణులతో సంప్రదించి రోగిని ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపించడం జరుగుతున్నదని స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ సంపత్ వివరించారు. ఇలా ముందుగానే సమాచారం ఇవ్వడం ద్వారా సమయం వృధా అవ్వకుండా అవసరమైన రోగులకు యాంజియోగ్రామ్, స్టంట్ మరియు గుండె ఆపరేషన్లు చేయడం జరుగుతుందని, ఈ ఇంజక్షన్ ద్వారా గుండెపోటు వలన సంభవించే మరణాలను నివారించవచ్చని స్పెషలిస్ట్ వైద్యులు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకువెళ్లి లక్షలకు వెచ్చించి సమయానికి అనుకూలంగా వైద్యం అందక ఎన్నో మరణాలను మన నందిగామ పరిసర ప్రాంత ప్రజలు చవిచూశారు. ఇప్పటి నుండి ఆ పరిస్థితులు ఉండవని ఆయన వివరించారు. ఇప్పటివరకు నందిగామ పరిసర ప్రాంత ప్రజలు 12 మందికి ఈ ఇంజక్షన్ ఉచితంగా అందించి వారి ప్రాణాలను కాపాడడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుండెపోటు జాగ్రత్తలు సంబంధించిన పోస్టర్ ను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. గుండె సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన లేకపోవడంతోనే ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నర్సులు ఆశా వర్కర్లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన డీజీపీ ని కలిసిన ఏపీజేఏసీ అమరావతి నేతలు



**మంగళగిరి, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తా ని శుక్రవారం మంగళగిరి డిజిపి కార్యాలయంలో ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర నేతలు మర్యాద పూర్వకంగా కలిసి నూతనంగా డీజీపీ భాధ్యతలు చేపట్టినందుకు వారికి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. డిజిపి ని కలిసిన వారిలో ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, ఏపీ గవర్నమెంట్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యస్.మల్లేశ్వరరావు ,రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వివి మురళీకృష్ణ నాయుడు, నారాయణరావు, రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర నాయకులు శ్రీదేవి, సైకం శివకుమారి రెడ్డి, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.నాగేశ్వరరావు, సిటీ జేఏసీ చైర్మన్ ఆర్.దుర్గాప్రసాద్ రావు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్, సంపత్, రమణ గార్లు, ఏపీ వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై బుర్రకథ కళాకారులచే అవగాహన



**కంచికచర్ల,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** స్టేట్ బ్యాంక్ జోనల్ మేనేజర్ మనీష్ కుమార్ సింగ్, రీజినల్ మేనేజర్ బట్టు నవీన్ బాబుల ఆదేశాల మేరకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కంచికచర్ల బజార్ బ్రాంచ్ మేనేజర్ మామిడాల సురేంద్ర ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విభూతి బ్రదర్స్ కళాజాత ద్వారా (బుర్రకథ కళాకారులు) ప్రజలకు అవగాహన కార్యక్రమంను శుక్రవారం కంచికచర్ల బస్టాండ్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ చవాన్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈజీ మనీ పేరుతో కనిపించే యాప్ లు, లోన్ యాప్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వివిధ యాప్ ల ద్వారా సంప్రదించి, బ్యాంక్ అకౌంట్ నుండి నగదును గ్రహించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ ఎం. సురేంద్ర మాట్లాడుతూ బ్యాంకులో కేవైసీ చేయించాలంటూ ఫోన్ చేసి కొందరు బెదిరిస్తారని, కస్టమ్స్ వద్ద చట్ట విరుద్ధమైన పార్సెల్ చిక్కుకుపోయింది, జరిమానా కట్టాలంటూ వస్తున్న కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లాటరీ తగిలిందంటూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడుగుతారని.. కుటుంబ సభ్యులు అరెస్టయ్యారంటూ విడిపించడానికి డబ్బులు కావాలంటూ బెదిరిస్తారని, తదితర సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు మాట్లాడుతూ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము పోలీసుఅధికారులమని విచారించాలని బెదిరించి డబ్బు కాజేస్తారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇటువంటి విపత్కర పరిస్థితులలో నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 టోల్ ఫ్రీ నెంబర్ లో సంప్రదించి తగు రక్షణ పొందాలని కోరారు. అత్యంత ఉల్లాసభరితంగా కొనసాగిన ఈ కళాజాతాలో గ్రామపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారిణి జొన్నలగడ్డ భవానీ ఆధ్వర్యంలో కాకులపాడు లో పొలం బడి



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** రబీలో అపరాలు సాగుచేసిన రైతులు నివారణపై శ్రద్ధ వహించాలని బాపులపాడు మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ జొన్నలగడ్డ భవాని సూచించారు , శుక్రవారం బాపులపాడు మండలం కాకులపాడు లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మినుము పంటను పరిశీలించి పూతదశిలో ఉన్న మినుము పంటలో మరూక మచ్చల పురుగులను గమనించారు. 35 రోజుల వయసులో గల పంటకు ఐదు శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5'0 మిల్లీమీటర్ల లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మొగ్గ పూత దశలో కొన్ని పూమొగ్గలలో పిల్ల పురుగులు కనిపించినట్లయితే వెంటనే క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీమీటర్లు లేక దయోజికార్స్ 1.0 గ్రామ్ ఏపీ ఫెడ్ 1'0 ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. పంటలో గుళ్ళు కనిపించినట్లయితే నివారణకు 1.0 గ్రాములు లేక కెనాల్ పాస్ 2.5 మిల్లీలీటర్లు లేక క్లోరి ఫైరి పాస్ 2.5 మిల్లీలీటర్లు లేకవన్ పాయింట్ జీరో మిల్లీలీటర్లు ఏదో ఒక మందును ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలని అవసరమైతే రెండు లేక మూడుసార్లు మార్చి మార్చి పిచికారి చేసుకోవాలని భవాని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వి హెచ్ ఏ లు కాకులపాడు గ్రామ రైతులు అట్లూరి సత్యనారాయణ స్వామి , పొట్లూరి జగన్మోహన్రావు , బాలకృష్ణ అట్లూరి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పల్లకి సేవ విజయవంతం...



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారికి పల్లకి సేవ శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగినది. పల్లకి సేవలో భక్తులు ఆలయ అధికారులు,అర్చకులు పాల్గొని పల్లకి సేవను విజయవంతం చేయడమైనది.

# క్వారీల్లో పేలుళ్ళు..ఆందోళనలో రైతులు

## నిబంధనలకు విరుద్ధంగా రాతి క్వారీల్లో రిగ్ బ్లాస్టింగ్ లు

- భారీ పేలుళ్ళతో ఎగిసిపడుతున్న దుమ్ము, బండ రాళ్లతో దెబ్బతింటున్న పంటలు
- ప్రాణ భయంతో పరుగులు పెడుతున్న రైతు కూలీలు
- లోయ గ్రామ పొలాల్లో పనులకు రావాలంటేనే జంకుతున్న కూలీలు
- బీడు భూములుగా మారుతున్న పంట పొలాలు
- అదేమని అడిగితే క్వారీ యజమాని బూతులు తిడుతున్నాడంటున్న రైతులు
- మైనింగ్, రెవిన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటున్న రైతులు
- క్వారీ పేలుళ్ళ నుంచి పంటలను కాపాడాలంటూ రైతులు వేడుకోలు



విలేకరులతో మాట్లాడుతున్న రైతులు





రిగ్ బ్లాస్టింగ్ దృశ్యాలు

రాతి క్వారీలలో భారీ పేలుళ్ళు తో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా రాతి క్వారీల యజమానులు నిబంధనలకు విరుద్ధం గా'రిగ్ బ్లాస్టింగ్'లకు పాల్పడుతున్నారు. ఈ భారీ పేలుళ్ళు కారణంగా దుమ్ము, ధూళితో పాటు పెద్ద పెద్ద బండ రాళ్లు ఎగిసిపడుతున్నాయి. దీంతో సమీప పంట పొలాలు దుమ్ము,ధూళితో నిండిపోతున్నాయి. అంతేకాకుండా పేలుళ్ల సమయంలో పెద్ద పెద్ద బండ రాళ్లు వచ్చి పంట పొలాలపై పడటంతో పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. నిబంధనలకు విరుద్ధం గా తమ పరిధికి మించి క్వారీలలో రిగ్గు బోర్లు వేసి బ్లాస్టింగ్ చేయడం వల్లే తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలం, గడ్డమణుగు గ్రామంలోని సన్నచిన్నకారు రైతులు ఆరోపిస్తున్నారు .మైనింగ్, భూగర్భ శాఖ,రెవిన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.....వారు కూడా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలలోకి వెళితే.....

**జి.కొండూరు,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,జి కొండూరు మండలం, గడ్డమణుగు గ్రామ శివారు లోయ గ్రామ పరిధిలోని రాతి క్వారీలలో భారీ పేలుళ్ల కారణంగా తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని,దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని గడ్డమణుగు గ్రామానికి చెందిన పలువు రు రైతులు వాపోయారు. భారీ పేలుళ్ళు కారణంగా చేతికొచ్చిన పంటలు దెబ్బ తిన్నాయని శుక్రవారం గడ్డమణుగు గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. భారీ పేలుళ్లతో పంట పొలాలు దెబ్బతింటు న్నాయని ఒక క్వారీ యజమానిని అడిగితే అతను ఇష్టానుసారంగా బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోయ లో సుమారు 800 ఎకరాలలో పత్తి, మొక్కజొన్న తోపాటు, వివిధ రకాల కూరగాలు పంటలు సాగవున్నా యనీ, క్వారీలలో జరిపే భారీ పేలుళ్లతో పంటలు దుమ్ము ధూళితో నిండిపోతు న్నాయని, దీంతో పంట దిగుబడి తగ్గి నాణ్యత ఉండటం లేదని రైతులు కంటతడి పెడుతున్నారు. ముఖ్యంగా పెద్ద పెద్ద బండ రాళ్లతో పంటపొలాల్లో బోర్లు, డ్రిప్ ఇరిగేషన్ దెబ్బ తింటున్నా యని అన్నారు. కూలీలు కూడా పనులు చేయడానికి రావడం లేదని, భారీ పేలుళ్ళు తో పరుగులు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులంటే లెక్కలేకుండా మాట్లాడుతు న్నారని తెలిపారు. డి.పూర్ణ చంద్రరావు, ఎ.సురేష్, కోటేశ్వరరావు లు క్వారీలు నడుపుతూ భారీ పేలుళ్లకు పాల్పడుతూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని గగ్గోలు పెట్టారు. స్పందన లో కూడా ఫిర్యాదు చేశామని ఏ అధికారి పట్టించుకోవడంలేదని అన్నారు. అనంతరం రైతులు విలేకరులకు దెబ్బతిన్న పంట పొలాలను చూపించారు.

### క్వారీ యజమానులు ఇబ్బంది పెడుతున్నారు:గద్దే గాంధీ, గడ్డమణుగు

లోయ లో నాకు 10.74 ఎకరాలు ఉంది. మాచినేని కోటేశ్వరరావు కు చెందిన క్వారీని గత ఐదేళ్ల నుంచి వేరే వాళ్ళు నడుపుతున్నారు. వీరు ఇక్కడి రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నా రు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీల యజమానులు రిగ్ బ్లాస్టింగ్ లు చేస్తున్నారు. ఈ భారీ పేలుళ్ళుతో పెద్ద పెద్ద బండ రాళ్లు పంట పొలాల్లో వచ్చి పడుతున్నాయి. విపరీతమైన దుమ్ము ధూళితో పంటలు దెబ్బతింటున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఈ క్వారీ ల వల్ల ఎప్పటికైనా మా ప్రాణాలకు ముప్పే. వెంటనే క్వారీ ఆపేయాలని డిమాండ్ చేస్తున్నాం.

# బీసీలకు అగ్రతాంబూలం

- నామినేటడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం కూటమి ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన బీసీ నాయకుడు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు



**మచిలీపట్నం,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** బీసీ వర్గాలకు నామినేటెడ్ పదవుల్లో 34% రిజర్వేషన్లు కూటమి ప్రభుత్వం కల్పించే దిశగా నిర్ణయం తీసుకోవడం బీసీ సామాజిక వర్గాలు ఆనందాన్ని వెలిబుచ్చాయని గడ్డం రాజు అన్నారు. దేశ జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ అమలు కొరకు బీసీ సంఘాల పోరాటానికి కూటమి ప్రభుత్వం మద్దతుగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో బీసీలకు కూటమి ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా ఒక్కొక్కటి అమలు చేస్తూ అభివృద్ధి సంక్షేమం దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబా బు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు "శ్రీ పవన్ కళ్యాణ్ చక్కటి ప్రణాళికలతో పరిపా లన కొనసాగిస్తున్నారని గడ్డంరాజు తెలిపారు. వైసిపి ప్రభుత్వం బీసీ నామినేటెడ్ పదవుల రిజర్వేషన్ కుదించి బీసీ సామాజిక వర్గాలకు తీరని అన్యాయం చేసిందని, బీసీల సంక్షేమ పథకాలు నిలుపుదల చేసి బీసీల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని గడ్డంరాజు విమర్శించారు. కూటమి ప్రభుత్వ బీసీలకు పెద్దపీట వేసిందని బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించే ప్రక్రియ చేపట్టిందని బీసీలు సద్వినియోగపరచుకోవాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలు కూటమి ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సంఘమ స్నానాలకు అనుమతి లేదు..!

- సింధు స్నానాల ఏర్పాట్లపై తర్జనభర్జన
- చర్చకు రాని సంఘమ విశిష్టత..



**కోడూరు, ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** మాఘ శుద్ధ పౌర్ణమి పర్వదిన్న సందర్భంగా హంసలదీవి సాగర తీరాన జరుగు పవిత్ర స్నానాల ఏర్పట్లపై అధికారుల,దేవాలయ పర్యవేక్షకుల మధ్య తర్జనభర్జన వాదనలు జరిగాయి. శుక్రవారం కోడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సుధా ప్రవీణ్ అధ్యక్షతన ఈనెల 12న జరగనున్న సింధూ స్నానాల ఏర్పాట్లపై ఉన్నత స్థాయి అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర కృష్ణ సంగమ ప్రదేశంలో భక్తులు స్నానాలు చేసేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు. సముద్ర స్నానాలకే అనుమతిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పవిత్ర సంగమ విశిష్టత ఏమిటి .సంగమ ప్రదేశంలో స్నానాలు ఆచరించాలని భక్తుల ఎందుకు ఆకాంక్షిస్తారన్న అంశం కనీస చర్చ కూడా జరుగలేదు.. ఈ స్నానాల ఏర్పాట్లకు నిధులు సమకూర్చుట కొరకు అధికారులకు, దేవాలయ నిర్వాహకుల మధ్య స్పష్టత రాకపోవడంతో సమావేశం అసంతృప్తిగా ముగిసింది.

## పాత్రికేయుడు కొండా కు మాతృవియోగం...
## పరామర్శించిన కాగిత, పాత్రికేయ మిత్రులు..



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం పాత్రికేయుడు, ఎనుమల కొండ, మాతృమూర్తి ఎనుమల వీర రాఘవమ్మ( 75) గురువారం మధ్యాహ్నం స్వర్గస్తులైనారు. ఆమె భౌతికకాయాన్ని పెడన నియోజవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, మరియు పాత్రికేయ మిత్రులు, బండారు మల్లికార్జున శర్మ, సి హెచ్ వి వి ఎస్ మల్లికార్జునరావు, మాగంటి చింతయ్య, దూసనపూడి రాంప్రసాద్, వక్కపాటి శివ, జోజి బాబు, కాగిత రాంబాబు తదితరులు వీర రాఘవమ్మకు ఘనంగా నివాళులర్పించి, రిపోర్టర్ కొండాకు ధైర్యం చెప్పారు...

## కూటమి ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కొరకు మెరుగైన విధానాన్ని తీసుకురావాలి

- ఔట్సోర్సింగ్ ఉద్యోగులను డిపార్ట్మెంట్లకు అప్పచెప్పే విషయం స్వాగతిస్తాం...
- మళ్లీ దళారి (ప్రైవేటు ఏజెన్సీలు) వ్యవస్థ నడిపితే ఉద్యోగులు అధోగతి పాలవుతారు.
- స్పెర్స్, మెప్మా ఉద్యోగుల మాదిరిగా హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి..
- నూతన విధానంతో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భరోసా కల్పించిలే చర్యలు తీసుకోవాలి.
- కూటమి ప్రభుత్వంపై ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కోటి ఆశలు పెట్టుకున్నారు..వారి ఆశలు అడియాశలు కాకుండా చూడాలి.
- ఆప్కాస్ కంటే మెరుగైన వ్యవస్థ ఏర్పాటు చేస్తారని నమ్మకంతో ఉన్నాం: ఏపీ సి ఓ ఈ ఏ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు




**విజయవాడ,ఫిబ్రవరి 7 (వార్తాప్రభ) :** ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసినా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కొరకు మరింత మెరుగైన విధానాన్ని తీసుకుని వచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఉద్యోగులకు న్యాయం చేయాలని కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కే సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు,అసోసియేట్ అధ్యక్షులు జి సంపత్ కుమార్, కోశాధికారి రమణమూర్తి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు నిన్నటి రోజున జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వరకు నడపబడుతున్న ఆప్కాస్ వ్యవస్థ రద్దు విషయం చర్చకు వచ్చిన సంగతి, అలాగే వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలు చూసిన అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కూటమి ప్రభుత్వానికి అనేక విషయాలు విన్నవిస్తూ శుక్రవారం అత్యవసరంగా జరుపుకున్న రాష్ట్రకమిటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పత్రికా ప్రకటన విడుదల చేసారు. ప్రస్తుతం నడుస్తున్న వ్యవస్థను రద్దు చేయాల్సి వస్తే మెరుగైన వ్యవస్థను తీసుకుని వచ్చి రాష్ట్రంలో అతి తక్కువ వేతనాలకు కీలక శాఖలో సైతం పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఔట్సోర్సింగ్ వ్యవస్థను నూతన నియామకాలను అన్ని అధికారాలను ఆయా డిపార్ట్మెంట్లకు అప్పజెప్పే విషయాన్ని అందరూ స్వాగతిస్తున్నామని అయితే మధ్యవర్తులు అనగా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పకుండా గత వ్యవస్థ (ఆప్కాస్) కంటే మెరుగ్గా ఉండేటట్లు మంచి వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రస్తుతం ఆప్కాస్ లో ఉన్నవారికి ఇంతవరకు ఆప్కాస్ లో లేకుండా దళారిమధ్య నలిగి పోతున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను అక్కున చేర్చుకోవాలని వారు కోరారు. మరల దళారీ వ్యవస్థ (ప్రవేటు ఏజెన్సీలు) ఏర్పాటు అయితే ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు అధోగతి పాలు అవుతాయని దీనివలన కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అభిప్రాయపడ్డారు. అలా కాకుండా ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆయా వ్యవస్థ డిపార్ట్మెంట్లకు ద్వారా నడపడం మంచిదని వారు తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ,స్పెర్స్ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులకు ఏ విధంగా అయితే హెచ్ఆర్ పాలసీ అమలు అవుతుందో ఆవిధంగా అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా కూటమి ప్రభుత్వం తీసుకుని వచ్చే నూతన విధానంలో హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగులందరికీ న్యాయం చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యేలు మంత్రుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అలాగే వారి మంత్రి వర్గంపై ఈ రాష్ట్ర ప్రభుత్వంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అపార నమ్మకం ఉందని వారు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన వ్యవస్థ అనగా మంచి ఫలితాలు సాధించే వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్లడాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తరపున స్వాగతిస్తూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నూతన విధానంలో భరోసా భద్రత కల్పిస్తూ న్యాయం చేయాలని కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకుని ఉన్నారని ,మంచి పాలనాధ్యక్షుడిగా పేరున్న ముఖ్యమంత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల చొరవ చూపి గతంలో ఉండే వ్యవస్థ కంటే మెరుగైన వ్యవస్థ ఏర్పాటు చేస్తారన్న రాష్ట్ర ప్రభుత్వ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల్లో ఉందని నూతన వ్యవస్థలో ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపే దిశగా అడుగులు వేయాలని ముఖ్యమంత్రిని,వారి మంత్రివర్గ సహచరులను ఎమ్మెల్యేలను రాష్ట్రంలోని అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరూ పాటు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం కోరుకున్నట్లు సుమన్ ,సురేష్ బాబు, సంపత్ కుమార్, రమణమూర్తి తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188